కరీంనగర్ వార్త
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 24, మే 2026 16 పేజీలు





2లో

## ఆదేశాలతో అధికారుల

# హడావుడి

- లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు
- ఆవిర్భావం రోజున కొత్త పెన్షన్లు మంజూరు
- లబ్ధిదారుల నిరీక్షణకు పడనున్న తెర
- జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ గృహాలు

చేయూత పెన్షన్లు ఎంతో ఆసరా ఇస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కువ శాతం మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులు పెన్షన్ల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల వచ్చే పెన్షన్ వారికి ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుతము పెన్షన్లు పొందుతున్న వారికి ఉపశమనం కలిగినప్పటికీ కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నవారు ఎంతో మంది ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కొత్త పెన్షన్లు మంజూరు కాలేదు. దరఖాస్తులకే పరిమితమైంది. కొంతకాలంగా దరఖాస్తుదారులు సంబంధిత అధికారులను పెన్షన్ల మంజూరు విషయమై అడుగుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వము నుండి ఆదేశాలు వస్తేనే పెన్షన్లు మంజూరు అవుతాయని అధికారులు సమాధానం చెబుతూ కాలం వెళ్ళబుచ్చారు.

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త**



## రోడ్డు విస్తరించేది

# ఎప్పుడో..!

2లో

**ఇరుకు రోడ్డుతో.. ఇబ్బందులో గ్రామస్తులు.. అభివృద్ధి నోచుకోని మండల కేంద్రం..**

ప్రభాత వార్త కోనరావుపేట మండల కేంద్రం ప్రధాన రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు. వివిధ పనుల నిమిత్తం గ్రామాల ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. రోడ్డు విస్తరణకు నోచుకోక పోవడంతో వచ్చి పోయే వాహనాలు ఎదురెదురు పడిన సందర్భంలో తీవ్ర ఇబ్బందులునెలకొంటున్నాయి. మండల కేంద్రానికి వివిధపనుల కోసం వచ్చే ప్రయాణికుల వాహనాల రద్దీ రోజురోజుకీ పెరగడంతో రోడ్డు ఇరుకుగా మారి భారీ వాహనాల రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.



2లో

## యుద్ధ ప్రాతిపదికన ధాన్యం మిల్లులకు

# తరలింపు..!

**వేగవంతంగా లోడింగ్ - అన్‌లోడింగ్ : కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త: జిల్లాలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా ధాన్యం లిఫ్టింగ్ చేపడుతూ, మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. మిల్లుల వద్ద కూడా అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని చెప్పారు.శనివారం గంగాధర మండలంలోని మధుర్‌నగర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్,పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంలు పరిశీలించారు.

## బాధితులకు చట్టబద్ధమైన న్యాయం

# సకాలంలో అందాలి



2లో

- ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలి
- అట్రాసిటీ కేసుల బాధితులకు ప్రభుత్వం మంజూరు పరిహారాన్ని నిర్దేశిత గడువులోగా విడుదల చేయాలి
- సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు తహసీల్దార్, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లి, ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీ బాధితులకు చట్టప్రకారం సకాలంలో న్యాయం అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని జిల్లా వ్యాప్తంగా విభిన్న పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రగతిని సమగ్రంగా సమీక్షించారు.

# బాధితులకు చట్టబద్ధమైన న్యాయం సకాలంలో అందేలా ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలి

### అట్రాసిటీ కేసుల బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసే పరిహారాన్ని నిర్దేశిత గడువులోగా విడుదల చేయాలి

### సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు తహసీల్దార్, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ బాధితులకు చట్టప్రకారం సకాలంలో న్యాయం అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని జిల్లా వ్యాప్తంగా విభిన్న పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రగతిని సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక పరిహారాన్ని నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా విడుదల చేసి బాధితులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పరిహారానికి సంబంధించిన ఫైళ్లను ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రతి సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో సంబంధిత తహసీల్దార్ మరియు పోలీస్ స్టేషన్ల ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కార్పొరేట్ కళాశాలల వంటి ప్రభుత్వ ఉన్నత విద్యా పథకాలను సద్విని యోగం చేసుకొని ఉన్నత విద్యావకాశాలను పొందాలని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన సాక్ష్యాధారాలను కోర్టులకు సకాలంలో సమర్పించి బాధితులకు చట్టబద్ధమైన న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, పెద్దపల్లి మరియు రామగుండం డీసీపీలు, ఏసీపీలు, పెద్దపల్లి మరియు మంథని ఆర్డీవోలు, డీఎస్సీడీవో రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్ అండ్ బీ ఈఈ, ఏడి మైన్స్, జిల్లా ఉపాధి అధికారి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి రాజగోపాల్, డీవీఎంసీ సభ్యులు కవ్వంపల్లి సతీష్, దావు రమేష్, జాది ప్రభాకర్, పార్శా విజయ్ కుమార్, ఎరుగురాల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఆదేశాలతో అధికారుల హడావుడి

### లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు

### ఆవిర్భావం రోజున కొత్త పెన్షన్లు మంజూరు

### లబ్ధిదారుల నిరీక్షణకు పడనున్న తెర

### జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ గృహాలు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** చేయూత పెన్షన్లు ఎంతో ఆసరా ఇస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కువ శాతం మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులు పెన్షన్ల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల వచ్చే పెన్షన్ వారికి ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుతము పెన్షన్లు పొందుతున్న వారికి ఉపశమనం కలిగినప్పటికీ కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నవారు ఎంతో మంది ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కొత్త పెన్షన్లు మంజూరు కాలేదు. దరఖాస్తులకే పరిమితమైంది. కొంతకాలంగా దరఖాస్తుదారులు సంబంధిత అధికారులను పెన్షన్ల మంజూరు విషయమై అడుగుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వము నుండి ఆదేశాలు వస్తేనే పెన్షన్లు మంజూరు అవుతాయని అధికారులు సమాధానం చెబుతూ కాలం వెళ్ళబుచ్చారు. ఎట్టకేలకు నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రెండు లక్షల మందికి పెన్షన్లు ఇస్తామని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రంలో కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. కొత్త పెన్షన్లకు దరఖాస్తులు వేల సంఖ్యలో వచ్చాయి.

అందరికీ ఒకేసారి పెన్షన్లు ఇవ్వడం సాధ్యపడదు. కొందరికి మాత్రమే పెన్షన్లు అందుతాయి. ఈ క్రమంలో దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఆదేశించడంతో అధికారుల్లో హడావుడి ప్రారంభమైంది. రెండవ దశ ఇందిరమ్మ గృహాలతో పాటు రెండు లక్షల పెన్షన్లు అందజేయనున్నారు. వారం రోజులు మాత్రమే సమయం ఉండడంతో కొత్త పెన్షన్లు పొందే వారి జాబితాల తయారీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులు చూస్తే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు వస్తాయా అనేది సందేహమే. 2022 ఆగస్టులో గత ప్రభుత్వము కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది. ఆ తర్వాత కొత్త పెన్షన్లు ఇవ్వలేదు. దరఖాస్తులు మాత్రం స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్త పెన్షన్లకు 50 వేల వరకు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. జిల్లాలో వృద్ధాప్య, దివ్యాంగుల, వితంతు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత, ఎయిడ్స్, ఫైలేరియా, డయాలసిస్ సంబంధించిన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకొని కొత్త పెన్షన్లకు ఎదురుచూస్తున్నారు. కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తే సంఖ్య మరింత పెరగనుంది. ఏ పద్ధతిలో పెన్షన్లు మంజూరు చేయాలి అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. ముందుగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆ తర్వాత మిగిలిన వారికి పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంది. దరఖాస్తుదారులందరికీ పెన్షన్లు వస్తాయి అనేది ప్రశ్నార్థకమే. ఇది ఇలా ఉండగా రెండో విడత ఇందిరమ్మ గృహాల పంపిణీకి జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. మొదట విడతలో పంపిణీ కార్యక్రమం పూర్తి కాగా ఇంకా గృహాల నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఇక రెండో విడత ఇందిరమ్మ గృహాలకు శ్రీకారం చుడుతున్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 3,500 గృహాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దరఖాస్తులను కూడా స్వీకరించింది. గ్రామాల్లో విచారణ చేసి దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేశారు. అర్హులను గుర్తించారు. దశలవారీగా గృహాలను మంజూరు చేస్తున్నారు. ఒక్కొక్క గృహ నిర్మాణానికి ప్రభుత్వము 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. గృహాల మంజూరు నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం పేర్కొంది. గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఉన్నత లక్ష్యంతో పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు అవుతాయని ఆశిస్తున్నారు. జిల్లాలో ఎంతోమంది దరఖాస్తు దారులు గృహాల మంజూరుకు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం కూడా దశలవారీగా గృహాలను మంజూరు చేస్తూ యుద్ధప్రాతిపదికపై నిర్మాణాలను పూర్తిచేసి ప్రారంభోత్సవాలను చేస్తుంది. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## ఇరుకు రోడ్డుతో..

# ఇబ్బందులో గ్రామస్తులు..

### అభివృద్ధి నోచుకోని మండల కేంద్రం..

### రోడ్డు విస్తరించేది ఎప్పుడో!

**ప్రభాత వార్త కోనరావుపేట** మండల కేంద్రం ప్రధాన రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. వివిధ పనుల నిమిత్తం గ్రామాల ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. రోడ్డు విస్తరణకు నోచుకోక పోవడంతో వచ్చి పోయే వాహనాలు ఎదురెదురు పడిన సందర్భంలో తీవ్ర ఇబ్బందులునెలకొంటున్నాయి. మండల కేంద్రానికి వివిధపనుల కోసం వచ్చే ప్రయాణికుల వాహనాల రద్దీ రోజురోజుకీ పెరగడంతో రోడ్డు ఇరుకుగా మారి భారీ వాహనాల రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒకే సమయంలో భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే ఏదో ఒకవాహనం వెనకకు తీసుకో వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్జామ్ ఏర్పడుతోంది. కొన్ని సందర్భాలో వాహనాలు అదుపుతప్పి పక్కనే వున్నా గోడలకు తగులు తుంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కోనరావుపేట మండలం కేంద్రం ఏర్పడి దాదాపు 40 సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు మండల రూపు రేఖలు మార్చే నాయకులు లేరు ఎన్నికల ముందు మండలాన్ని ఆదర్శ మండలంగా సెంటర్ లైటింగ్ సిస్టం అమర్చి మండలాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తారు కానీ గెలిచిన తర్వాత మర్చిపోయారు నాయకులు మారిన పార్టీలు మారిన మండల కేంద్రం రూప రేఖలు మారుత లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గతంలో ప్రధాన రోడ్డు 40 ఫీట్ల వెడల్పుతో నూతనంగా నిర్మాణం చేపట్టాలనిగ్రామపంచాయతీ తీర్మానం చేసింది కానీ అమల్లోకి తీసుకురాలేదు రోడ్డుసమస్యలను ఎదుర్కొంటు న్నారు. మండల కేంద్రంలో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే పాల కులు కరువయ్యారని మండలకేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా బస్టాండ్ నుండి గాంధీ నగర్ వరకు రోడ్డు వెడెల్పు పనులను పూర్తిచేస్తే వాహన దారులకు ఇరుకురోడ్డు ఇబ్బందులు తొలగు తాయని వాహనదారులు కోరుతున్నారు. అధికారులు వెంటనే రోడ్డు వెడెల్పు పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## వడదెబ్బకు రైతు మృతి

**మంగపేట మే23, ప్రభాతవార్త.**



మండలంలోని రామచంద్రుని పేటకు చెందిన ఊటుకూరి సోమిరెడ్డి(78) అనే రైతు శుక్రవారం వడదెబ్బకు మృతి చెందారు. మండలం లోని పూరెడుపల్లి ఊర చెరువులో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం కొంత మంది గ్రామస్తులు చెరువుకు వెళ్లగా చెరువులో పడుకుని ఉన్నట్లుగా ఉన్న వ్యక్తిని గమనించి అక్కడికి వెళ్లి చూడగా అతను మృతి చెందినట్లుగా గమనిచడంతో అతను రామచంద్రునిపేటకు చెందిన సోమిరెడ్డిగా గుర్తించినట్లు తెలిపారు. సోమిరెడ్డికి పూరెడుపల్లి ఊర చెరువు శివారులోని పంట పొలానికి వచ్చి వడదెబ్బకు గురై సొమ్మసిల్లి అక్కడ నుండి వెళ్లలేక చెరువులో పడుకుని అక్కడే మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానం తెలుపుతున్నారు. ఈసారి ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే సోమిరెడ్డి వడదెబ్బకు గురై మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, కొడుకు, కూతురు ఉన్నారని సోమిరెడ్డి మృతి వార్తను పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపినట్లు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన

# ధాన్యం మిల్లులకు తరలింపు

### వేగవంతంగా లోడింగ్ – అన్‌లోడింగ్ : కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:** జిల్లాలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా ధాన్యం లిఫ్టింగ్ చేపడుతూ, మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. మిల్లుల వద్ద కూడా అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని చెప్పారు. శనివారం గంగాధర మండలంలోని మధుర్‌నగర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం లోడింగ్ ప్రక్రియను వారు సమీక్షించారు. ఇంకా ఎంత ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది, ఎంత మేర లోడింగ్ పెండింగ్‌లో ఉంది, ఎన్ని లారీలు అవసరం, రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా వంటి అంశాలపై అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు వెంటనే లారీలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, సత్వరమే ధాన్యాన్ని లిఫ్టింగ్ చేసి మిల్లులకు తరలిస్తున్నామని ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గన్నీ బ్యాగుల కొరత ఉందా, లారీలు సమయానికి వస్తున్నాయా, లోడింగ్ – అన్‌లోడింగ్ పనులు సక్రమంగా జరుగుతున్నాయా వంటి విషయాలపై కూడా అధికారులు రైతులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సత్యం పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం మరింత సత్వరంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టి రైతులకు ఎలాంటి నష్టం ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గంగాధరలో గోదాం పరిశీలన: గంగాధరలో ఎమ్మెల్యే సత్యం, పోలీస్ కమిషనర్ తో కలిసి కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. గోదాంలో ఎన్ని మెట్రిక్ టన్నుల బస్తాలు నిల్వ చేసుకోవచ్చు సామర్థ్యం ఎంత అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నుంచి ధాన్యాన్ని తరలించి భద్రపరచినందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, డిఎం రజనీకాంత్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు...



# సిరిసిల్లలో ఇండ్లే లక్ష్యంగా చోరీలు..

దొంగల ముఠా అరెస్ట్!

**17.5 గ్రాముల బంగారం, 14.5 తులాల వెండి స్వాధీనం**

సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త



తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఎనిమిది మంది సభ్యుల దొంగల ముఠాను సిరిసిల్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 17.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 14.5 తులాల వెండి ఆభరణాలు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు సెల్ ఫోన్లు, రూ. 1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మీడియా సమావేశంలో వెల్లడించారు.

### జల్సాల కోసమే ముఠాగా ఏర్పడి..

డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల బి.వై నగర్‌కు చెందిన అడెపు రవి (25) అనే పాత నేరస్థుడు జల్సాలకు అలవాటు పడ్డాడు. దొంగతనాలు చేయడమే వృత్తిగా మార్చుకున్న అతడు, పగటిపూట పట్టణంలో రెక్కీ నిర్వహించేవాడు. ఇందుకోసం తన స్నేహితులైన సామల్ల బాలకిషన్ (26), బోదాసు గోపి (19), వేముల సాయి చరణ్ రెడ్డి (19), గాజులవేణి కుమార్ (23), మూల అభిలాష్ (19)లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డాడు. వీరంతా రాత్రి సమయాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లపై పడి చోరీలకు పాల్పడేవారు. ఈ



ముఠా లీడర్ అడెపు రవి గతంలోనే 18 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా, జైలు నుంచి బయటకు వచ్చాక మళ్లీ ముఠాను ఫామ్ చేసి నేరాలకు తెగబడ్డాడు. గత నెల ఏప్రిల్ 26 నుండి మే 21వ తేదీల మధ్య కాలంలో సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు ఇళ్లలో ఈ ముఠా తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడింది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం ఈ ముఠా సభ్యులు మరో పెద్ద దొంగతనం చేసేందుకు ప్లాన్ వేసి ఆటోలో సిరిసిల్ల వైపు వస్తున్నారు. దీనిపై ముందస్తుగా నమ్మదగిన సమాచారం అందుకున్న పోలీసులు సిరిసిల్లలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టైల్లో విచారించగా నిందితులు తాము చేసిన దొంగతనాలను ఒప్పుకున్నారు. చోరీ చేసిన సొత్తును ముస్తాబాద్‌కు చెందిన కస్తూరి సాయితేజ, వేములవాడకు చెందిన శీలం సంతోష్ రెడ్డి (రిసీవర్లు) లకు అమ్మి, వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు అంగీకరించారు. దీంతో దొంగిలించిన సొత్తును రికవరీ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

### పోలీస్ సిబ్బందికి అభినందనలు

చాకచక్యంగా వ్యవహరించి అంతర్జిల్లా దొంగల ముఠాను పట్టుకున్న పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ శ్రీకాంత్‌లతో పాటు సిబ్బంది పున్నల్క శ్రీనివాస్, శ్రీకాంత్, మారుతి, రవి, నాంపెల్లి శ్రీనివాస్, నాగరాజులను డీఎస్పీ నాగేంద్రచారి ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.

## అనారోగ్యంతో బాధపడుతూ వివాహిత ఆత్మహత్య

జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వివాహిత తన నివాసంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జాబితాపూర్ గ్రామానికి చెందిన మారిశెట్టి కవిత 40, భర్త రవి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా కవిత తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ, మానసిక స్థితి సరిగా లేక సతమతమవుతోంది. ఈ క్రమంలోనే, శనివారం రోజున మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి, కవిత తన గదిలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. మృతురాలి భర్త రవి 49 ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

## ఇద్దరికీ వెలుగులు ప్రసాదించిన నేత్రదాత మూల సరోజన



**ఓదెల, ప్రభాతవార్త:** సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూల సరోజన నేత్రదానం కుటుంబ సభ్యులకు అభినందనలు తెల్పిన గ్రామ సర్పంచ్ గోలి లింగారెడ్డి. ఉప సర్పంచ్ మూల సంపత్ రెడ్డి తోపాటు సదాశయ ఫౌండేషన్ ప్రతి నిధులు కొమిరె గ్రామస్తులైన మూల సరోజన అనారోగ్యంతో మర ణించగా సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి, సూత్రాల రవి నేత్రదానంపై అవగాహన కల్పించగా వారి కుటుంబ సభ్యులు స్పందించడంతో వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో కార్నియాలు సేకరించి సికింద్రాబాద్ ఐ బ్యాంక్ పంపించారు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన వారి కుటుంబ సభ్యులు కుమా రులు కీర్తిశేషులు మహిపాల్ రెడ్డి రజిత, ప్రేమ సాగర్ రెడ్డి ఉమామ హేశ్వరి. (ఓదెల. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు) కీర్తిశేషులు మూల లిం గారెడ్డి, మనుమలు రాజసింహారెడ్డి, భరత సింహారెడ్డి, మనుమరాలు శైలజా రెడ్డి వినిల్ రెడ్డి లకు ఓదెల ప్రతినిధులు క్యాతం మల్లేశం, అల్లం సతీష్, క్యాతం వెంకటేశ్వర్లు, మేరుగు సారంగం, డాక్టర్ వెంకటేశ్వర్లు, బాలసాని సంతోష్. జీడి. నవీన్. అరుకాల. తిరుపతి నేత్రదాతకు నివాళులు అర్పించి కుటుంబానికి అభినందనలు తెలిపారు. సమాజ హితం కాంక్షించి నేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ప్రచార కార్యదర్శి వాసు గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ముఖ్య సలహాదారులు రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

## అగ్నికి ఆహుతి అయిన ఆయిల్‌ఫామ్ చెట్లు..అపారనష్టం..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలో గత వారం రోజులుగా భానుడి భగభగలతో మండలం నిప్పుల కుంపటిగా మారింది. గ్రామాలలో అక్కడక్కడ రైతులు వరికోయకాలుకు నిప్పు పెడుతుం డడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే శనివారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల ఆబాది జమ్మికుంట శివారులో రైతులు పంటపొలాల వ్యర్థాలను తగలపెడుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ మంటలు ఎగిసిపడడంతో ఆ పక్కనే ఉన్న ఇదే గ్రామంలోని బోళ్ల వేణుకు చెందిన ఫామాయిల్ తోటకు నిప్పు అంటుకుంది. అదే భూమిలో డైరీఫార్మా, ఆర్గానిక్ ఫార్మ, ఉత్పత్తులను చేస్తున్నాడు. ఈ అగ్ని ప్రమాదం వల్ల పక్కనే ఉన్న డైరీ ఫార్మలోకి మంటలు వ్యాపించి, డైరీ ఫార్మాకు చెందిన గుడిసెలు, పశుగ్రాసం, ఆర్గానిక్ ఫార్మాకు చెందిన వస్తుసామాగ్రి పైపులైన్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ తోటలను పెంచుతే సబ్సిడి ఇస్తుందన్న ఆశతో రైతు ఇంతకాలంగా చూసిన ఆశలు అడియాశలు అయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 10లక్షల రూపాయల మేరకు ఆస్తినష్టం జరిగిందని రైతు బోళ్ల వేణు కన్నీంటి పర్యాంతమయ్యారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వం స్పందించి రెవెన్యూ అధికారులచే విచారణ జరిపించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జమ్మికుంట రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు.

## ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదాం



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా జాతీయ హరితదళం మరియు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో బాగంగా పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధరూర్ కాలనీ లో కొనసాగుతున్న వేసవి శిబిరం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ విద్యపై అవగాహన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా హరితదళం కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్ రెడ్డి లు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ పక్షాన ప్రశంసా పత్రాలు, బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు ఆనందరావు, ఉపాధ్యాయులు శ్రీదేవి, ప్రభాకర్, సమ్మర్ క్యాంప్ వాలంటీర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# నేరాలు-దారుణాలు

## ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్ చోరీ కేసులో అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

-రూ.80 వేల కాపర్ వైర్, 2 బైక్‌లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

-పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి

రామగిరి ప్రభాతవార్త:



పంట పొలాల వద్ద, రహదారుల వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లు దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రామగిరి పోలీసులు అరెస్టు చేసి నిందితుల నుంచి రూ.80 వేల విలువైన కాపర్ వైర్, రూ.20 వేల విలువైన ఏసీ ఔటర్, రెండు మోటార్ బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి తెలిపారు. శనివారం రామగిరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామగిరి మండలం కల్వచర్ల మారుతి నగర్ హనుమాన్ ఆలయం సమీపంలో దొంగిలించిన సామగ్రిని తరలిస్తున్న సమయంలో సుల్తానాబాద్ మండలం దేవునిపల్లికి చెందిన శీర్ల లచ్చయ్య, మోటం దేవేందర్, మోటం జంపయ్య, మోటం అజయ్‌లను రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా దగ్గరి బంధువులే కాగా 14 కేసుల్లో నిందితులునీ ప్రస్తుతం రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. నిందితులు రామగిరి మండలం పన్నూరు జేఎన్టీయూ కళాశాల సమీపం, మంథని అయ్యగారు చెరువు కట్ట, కూచిరాజ్‌పల్లె, అక్కేపల్లి ప్రాంతాల ట్రాన్స్ ఫార్మర్లు, సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ ట్రాన్స్‌ఫార్మర్, అంతర్గాం మండలం కుందనపల్లి పంప్‌హౌస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అదేవిధంగా రామగిరి మండలం కల్వచర్లలోని కృష్ణవేణి పాఠశాల వద్ద ఏసీ ఔటర్‌ను కూడాఅపహరించినట్లు తెలిపారు. దొంగిలించిన కాపర్ వైర్లు, ఏసీ ఔటర్‌ను మోటార్ బైక్‌లపై తరలిస్తున్న సమయంలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రామగిరి ఎస్సైలు తాడవేని శ్రీనివాస్, దివ్యతో పాటు సిబ్బంది అభిషేక్, రమేష్, రాజ్‌కుమార్‌లను డీసీపీ, ఏసీపీ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ , మంథని సీఐ బొల్లపల్లి రాజు ఏఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

## వడదెబ్బతో మహిళ మృతి

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలంలోని ఆదివారం పేట గ్రామానికి చెందిన బుడిగే కమల (65) శనివారం వడదెబ్బతో మృతి చెందింది. మధ్యాహ్నం ఇంటి బయట చిన్న చిన్న పనులు చేస్తుండగా గాలిలో తేమశాతం పడిపోయి గంటలు గంటలుగా వేడి వడగాలులు వీయడంతో వడదెబ్బ తగిలి అక్కడి కక్కడే మృతి చెందింది. మృతురాలు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ ఇల్లందుల సంజీవ్ తోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

## లంబాడిపల్లిలో యువకుడు ఆత్మహత్య

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలం లంబాడి పెల్లి గ్రామంలో గంధం అఖిలేష్ ( 23) ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం మృతుని తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు చేసినట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు, కూలి పని నిమిత్తం ముంబాయి వెళ్లిన అఖిలేష్ వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడని , శనివారం ఉదయం 7 గంటలకు చూసేసరికి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు, గతంలో ఎవరో అమ్మాయిని ప్రేమించాడని వారి మధ్య ఏమన్నా మనస్పర్థలు వచ్చి ఉంటాయని, మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకో వచ్చునని మృతుని తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు,

# పెరిగిన వేతనాలను అమలు చేయాలి

**కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :**

ఈ నెల నుండి పెరిగిన బీడీ కార్మికుల వేతనాలను బీడీ పరిశ్రమ యజమానులు ఒప్పందం ప్రకారం వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏఐటియుసి) సుతారి రాములు తెలిపారు. శనివారం బీడీ కార్మిక సంఘం ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సి ప్రభాకర్ భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర నేత మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన బీడీ యజమానుల ప్రతినిధులకు బీడీ కార్మిక సంఘాల నేతల మధ్య హైదరాబాదులో చర్చలు జరిగాయని, సుదీర్ఘ చర్చ అనంతరం



1000 బీడీలు చుట్టినందుకు రూ.275. 31 పైసా వీడి ప్యాకింగ్ వర్కర్స్ కు ఉన్న వేతనంపై 4500 నెలసరి ఉద్యోగులకు ఇతరత్రా సిబ్బందికి రూ. 2200 వేతనాలు చెల్లించుటకు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ఈ నెల నుండి రెండు సంవత్సరాల కాల పరిమితి వరకు ఉంటుందని, నాణ్యతమైన తునికాకు తరపున చేయుటకు నూతనంగా బీడీ కార్మికులకు పిఎఫ్ నెంబర్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ పెరిగిన వేతనాలు తెలంగాణ రాష్ట్రంలోని 7 లక్షల మంది బీడీ కార్మికులకు వర్తిస్తుందని, పిఎఫ్, నాన్ పిఎఫ్ కార్మికులకు కూడా సమానంగా వేతన కూలి ఇచ్చుటకు నిర్వహించడమైందన్నారు. నూతన ఒప్పందాన్ని అమలు చేయని యజమానులపై చట్ట ప్రకారము కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కొక్కుల శాంతక్క ఉపాధ్యక్షులు న్యాయవాది చిన్న విశ్వనాథం జిల్లా కోశాధికారి మహమ్మద్ ముక్రం జిల్లా నేతలు మునుగోరి హనుమంతు వెన్న మహేష్ అందే వంశీకృష్ణ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు

# భూములు కోల్పోయిన రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

## కలెక్టర్ సత్యప్రసాద్

**మేడిపల్లి, ప్రభాతవార్త :**

జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి ఎన్ హెచ్ 63 విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన ఆర్బిట్రేషన్ హియరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్లాపూర్, మోహన్ రావుపేట, మేడిపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 323 మంది అవార్డీల కేసులను విచారణకు తీసుకున్నారు. భూముల స్వాధీనంపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, పరిహారం అంశాలు, ఇతర



సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. పలువురు పిటిషనర్ల తరపున న్యాయవాదులు హాజరై రైతుల అభిప్రాయాలను, సమస్యలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. నేషనల్ హైవే 63 ప్రాజెక్టుకు సంబంధించి మంచిర్యాల పీడీ తరపున అడ్వకేట్ హాజరై సంబంధిత వివరాలను



వెల్లడించారు. ఈ హియరింగ్‌లో కోరుట్ల ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డి పాల్గొని భూ స్వాధీన ప్రక్రియ, పరిహారం చెల్లింపుల అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోరుట్ల ఎల్. జీవాకర్ రెడ్డి, కలెక్టరేట్ జి సెక్షన్ సూపరింటెంట్ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వా మ్యు లు కావాలి

**మేడిపల్లి, ప్రభాతవార్త**

: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జాతీయ హరితదళం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు పాఠశాలల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహణ లో భాగంగా కె .జి. బి.వి మేడిపల్లి లో కొనసాగుతున్న వేసవి శిబిరం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పై గీతాలు ఆలపించారు, నాటకం వేశారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్, పర్యావరణ రాయబారి మచ్చ రాజశేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం లో విద్యార్థులందరూ




భాగస్వాములు కావాలని వాయుకాలుష్యం వల్ల ప్రజలకు ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయని జలకాలుష్యం వల్ల తాగునీటి కొరత ఏర్పడుతుందని తెలిపారు. చెట్లను నరకడం వల్ల వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయని, అలాగే ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. పర్యావరణాన్ని రక్షిం చడంలో భాగంగా ప్రతి విద్యార్థి ఇంటి పరిసరా లలో మొక్కలు నాటి వాటిని పెంచాలని సూచిం చారు విద్యార్థులందరూ మీ పుస్తకాలను, నోట్ బుక్ లను వృథా చేయవద్దని, పేపర్ తయారవుటకు చెట్లు ఉపయోగ పడుతున్నాయని మీరు పేపర్ చించి వృథా చేయవద్దని పర్యావరణం కాపాడటం లో మీరు పాల్గొనాలని విద్యార్థులకు తెలియజేశారు. చిత్రలేఖనం , నాటకం,సాంగ్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను జాతీయ హరిత దళం జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్ అందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కే జి.బి.వి. స్పెషల్ ఆఫీసర్ నిషాద్ సహెద , సంగీత,జ్యోతి లు , ఏం ఐ ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# భారీ అగ్నిప్రమాదం 6 వేల ఈత చెట్లు దగ్ధం

## ఉపాధి కోల్పోయిన 63 గీత కార్మిక కుటుంబాలు

**కోరుట్ల రూరల్, ప్రభాతవార్త**

:కోరుట్ల మండలంలోని చిన్న మెట్పల్లి గ్రామంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం సుమారు 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి గ్రామ శివారులో ఉన్న ఈత వనాన్ని ఆవరించాయి. వేగంగా వ్యాపించిన మంటలు కొద్ది సేపట్లోనే విస్తారమైన ప్రాంతాన్ని కమ్మేయడంతో సుమారు 6 వేల వరకు ఈత చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ అప్పటికే మంటలు విస్తృతంగా వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఎండలు తీవ్రంగా ఉండటం, గాలులు ఎక్కువగా వీయడం వల్ల మంటలు మరింత వేగంగా వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలోని గీత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న మెట్పల్లి గ్రామంలో మొత్తం 63 కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఈత చెట్లు పూర్తిగా కాలిపోవడంతో తమ కుటుంబాల జీవనాధారం



కోల్పోయామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. రోజువారీ ఆదాయం పూర్తిగా నిలిచిపోయిందని, ఇక కుటుంబాలను ఎలా పోషించాలో అర్థం కావడం లేదని గీత కార్మికులు వాపోతున్నారు. ప్రమాదంలో లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన గీత కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు, బాధితులు కోరుతున్నారు. కాలిపోయిన ఈత వనాన్ని పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# పలువురు మృతుల అంతిమయాత్రలో పాల్గొన్న జువ్వాడి



**కోరుట్ల, ప్రభాతవార్త :**

కోరుట్ల పట్టణం, మండలం లో ఒకేరోజు పలువురు మృతిచెందగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు రజి, కోరుట్ల పట్టణం లో నివాసం ఉంటున్న రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ తల్లి, పాత్రికేయులు గంగుల రామ్ గోపాల్ సత్యార్థ ప్రకాష్ ల తల్లి రాంబాయి, పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ముక్కెర మీనయ్యలు శనివారం మృతిచెందగా వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఇటీవల పసుల విక్రమ్ మృతి చెందగా ఆయన తండ్రి రాంప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. జువ్వడి కృష్ణారావు వెంట కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల వసంత గంగాధర్, బలిజ రాజారెడ్డి, మురళి, సంగ లింగం, రిజ్వాన్ తదితరులున్నారు

# ఉపాధి హామీ పనులను పరిశీలన



**కోరుట్ల, ప్రభాతవార్త :**

కోరుట్ల మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన స్టాగ్గెర్డ్ ట్రెంచ్ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండ వాలు ప్రాంతాల్లో, ఖాళీ స్థలాలలో భూగర్భ జలాల పెంపునకు, నేల కోతను నివారించడానికి చేపడుతున్న ఈ ట్రెంచ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామంలో జాబ్ కార్డ్ యాక్టివ్ గా ఉన్న కూలీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పనులకు హాజరు కావాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కూలీలందరికీ గ్రామంలోనే ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనుల వద్ద తాగునీరు, నీడ కొరకు టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో కూడిన మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్సుమలత,కార్యదర్శి ప్రియాంక, కూలీలు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక

**చొప్పదండి,ప్రభాతవార్త:**

చొప్పదండి ఎస్ సి సామజిక వర్గ ప్రజల అర్ధకాభివృద్ధి లో సబ్సిడీ లోన్లలో భాగంగా ఈ నెల 25న సోమవారం మధ్యాహ్నం 2గంటలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో దరఖాస్తు చేసుకున్న వారికి మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూలకు కార్యాలయంలో సమర్పించిన సెట్ మరియు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కులం, ఆదాయం, డ్రైవింగ్ లైసెన్సు, బ్యాంకు మొదలగు ఒరిజినల్ సర్టిఫికెట్ల సెట్ తో హాజరుకాగలరని కమిషనర్ కోరారు.

# గంజాయి అక్రమ రవాణా నివారణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**-కలెక్టర్ కె హరిత**

**కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 23, ప్రభాతవార్త :**



జిల్లాలో అక్రమంగా గంజాయి సాగు చేసిన వినియోగించిన సంబంధిత ఆదికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత సూచించారు. శనివారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో సంబందిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశానికి అదనపు ఎస్పి అడ్మిన్ చిత్తరంజన్ ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుండి వచ్చే వాహనాలను రవాణా శాఖ ఆదికారులు పకడ్బందీగా తనిఖిలు నిర్వహించాలన్నారు. కల్లు కంపౌండ్ లలో విక్రయించే తెల్లకల్లు శ్నాపిల్ ను తిసుకోవలన్నారు. కల్లు కాంపౌండ్ లలో సిసి కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పాఠశాల పరిసరాలలోని వంద మీటర్ల పరిధిలో వున్న పాన్ టేళాల్లో క్షున్నంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గంజాయి సాగు చేసె వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలని, అడవులో గంజాయి సాగు చేయకుండా అటవీ శాఖా అధికారులు చర్యలు తిసుకోవలన్నారు. మెడికల్ షాప్ లను తనిఖీలు నిర్వహించి అధిక మోతాదు మత్తు మందుల కొనుగోలు చేసె వారి వివరాలు సేకరించాలన్నారు. బస్టాండ్ , రైల్వే స్టేషన్ లో అనుమానస్పదంగా సంచరించే వారి వివరాలు సేకరించాలని, గంజాయి సేకరించడం వల్ల ఆరోగ్యం చెడిపోయి ఆర్దికంగా కుటుంబాలు చితికిపోతున్నాయని, గంజాయి నివారణకు గ్రామాలలో విస్రృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆటో, వాహనాల డ్రైవర్ల కు గంజాయి రవాణా చేయడం వల్ల జరిగే నష్టాలపై అవగాహనా కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు గంజాయి సాగు అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: మే 23, ప్రభాతవార్త:**

జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన వరి, మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వలు, మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపుల వివరాలను మండలాల వారీగా క్షుణ్ణంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ధాన్యం పూర్తిగా కొనుగోలు కేంద్రాలకు వచ్చేసిందని, రైతులు అనవసరంగా రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకూడదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి గోనె సంచుల్లో నింపి, లారీల ద్వారా మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ముందుగానే తగినన్ని లారీలను సమకూర్చుకోవాలని, రవాణాలో జాప్యం జరగకుండా చూడాలని రవాణా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ధాన్యం తూకం, లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ప్రతి కేంద్రంలో అవసరమైన మేరకు హమాలీలను అందుబాటులో ఉంచాలన్నారు. హమాలీల కొరత వల్ల కొనుగోళ్లు ఆలస్యం కాకూడదని హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉష్ణోగ్రతలు 4245 డిగ్రీల



మధ్య నమోదవుతున్న నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, మజ్జిగ, నీడ, తాటాకు పాకలు, ప్రథమ చికిత్స కిట్ వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. అ కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, దళారీ వ్యవస్థకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎస్ఓ రాజేందర్, సివిల్ సప్లై డీఎం సుధాకర్, డిఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, వ్యవసాయ శాఖ ఏడీ, మార్కెటింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. చివరగా, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో అధికారులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పునరుద్ఘాటించారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**-కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23, ప్రభాతవార్త**

కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహసిల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహసిల్దార్ సదానందం తో కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కే డి సి ఏ వారు నిర్వహించే అండర్ 14, అండర్ 16, మరియు అండర్ 19 టోర్నమెంట్‌కి జగిత్యాల జిల్లాజట్ల క్రీడాకారుల ఎంపిక స్థానిక జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో క్రింది తేదీలలో నిర్వహించడం జరుగుతుందిఅండర్14, జట్టు ఎంపిక ఈ నెల 25 వ తేదీన, అండర్16 ఈ నెల 26 వ తేదీన అండర్ 19 ఈ నెల 27 వ తేదిన నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా క్రికెట్ ఇంచార్జీ దాడి జలపతి ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 7 గంటలకు తమయొక్క మీసేవ నుండి పొందిన జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోటో మరియు సొంత కిట్ తీసుకొని పూర్తి యూనిఫాంతో హాజరు కావాలి మరిన్ని వివరాలకి 9948064712 నెంబర్ కి సంప్రదించగలరు

# కేజీబీవీ సమ్మర్ క్యాంపును సందర్శించిన ఎంఈఓ వై రమేష్

**ఓదెల, ప్రభాతవార్త:**



ఓదెల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఎంఈఓ వై రమేష్ సందర్శించాను ఈ సందర్భంగా వై రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు యోగా శిక్షకురాలు వాణి యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 12వ తేదీన మొదలైన ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగ, ఆర్ట్ అండ్ కల్చర్, నృత్యం, మరియు ఇండోర్ అవుట్ డోర్ గేమ్స్ లో వసతితో కూడిన శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని 10 కేజీబీవీల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారని విద్యార్థులు సంతోషంగా సమ్మర్ క్యాంపును ఆస్వాదిస్తున్నారని అన్నారుఈ కార్యక్రమంలో కేజీబీవీ ఇన్చార్జ్ టీచర్, వాలంటీర్లు, సీఆర్పీలు ఏ. తిరుపతి, రాజేందర్ పాల్గొన్నారు.

## జాతీయ కరాటే టోర్నీకి తెలంగాణ నుంచి 81 మంది ఎంపిక

**గోదావరిఖని, ప్రభాతవార్త:** వచ్చే నెల ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జూన్ 3 నుంచి 7 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచి 81 మంది విద్యార్థిని, విద్యార్థులు ఎంపికైనట్లు తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ మల్యాల రామస్వామి తెలిపారు.



రాష్ట్ర స్థాయి సెలక్షన్లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. అలాగే స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, ట్రెజరర్ మల్లికార్జున గౌడ్ పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులకు నిర్వాహకులు ఉత్తేజం కల్పించారు. క్రమశిక్షణ, పట్టుదలతో పోటీల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

## కుటుంబ ప్రయోజన పథకంను సద్వినియోగం చేసుకోవాలి

**ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి**

**ప్రభాతవార్త కోనరావుపేట** పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోనరావుపేట మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి స్నిగ్ధ రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరైన వ్యక్తి మరణిం చినప్పుడు కుటుంబానికి ఒకేసారి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తామనితెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న శ్వేత రేషన్ కార్డు దారులు ఈ పథకానికి అర్హులు కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పథకంఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఫోటోతో కూడిన దరఖాస్తు పత్రం, శ్వేత రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు, మరణ ధృవీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ నకలు తదితర పత్రాలను సమర్పించాలని సూచించారు అర్హులైన వారు ఈ పథకం ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పంట వ్యర్థాలను దహనం చేస్తే 10వేల జరిమానా

**ఓదెల, ప్రభాతవార్త:**

ఓదెల మండల తహసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా తహసిల్దార్ ధీరజ్ కుమార్ మాట్లాడుతూ శనివారం సుల్తానాబాద్ కోర్ట్ వద్ద జూనియర్ సివిల్ జడ్జ్ గణేష్ అలాగే మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఆధ్వర్యంలో పంట వ్యర్థాల దహనం వల్ల కలిగే అనర్థాలు మరియు చట్ట బద్ధ చర్యల పట్ల తహసీల్దార్లకు అలాగే గ్రామ పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం కల్పించారని అన్నారు అదేవిధంగాపంట వ్యర్థాల దహనం చట్ట రీత్యా నేరం ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్ ఆక్ట్ మరియు ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ఆక్ట్ క్రమము చట్ట రీత్యా కేసులు పెట్టడం జరుగుతుందనిమొదటి శిక్షకు 10,000 రూపాయల ఫైన్ రెండవ సారి శిక్షకి లక్ష రూపాయల జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష విధించడం జరుగుతుందని తహసిల్దార్ ధీరజ్ కుమార్ తెలిపారు

## మున్సిపల్ కోఆప్షన్ సభ్యుని ఎన్నిక నిర్వహించాలి

### అడిషనల్ కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి



**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :** మెట్‌పల్లి మున్సిపాలిటీలో రిటైర్డ్ గెజిటెడ్ ఉద్యోగి కేటగిరీ కోఆప్షన్ సభ్యుని ఎన్నికను తక్షణమే నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) ను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోఆప్షన్ సభ్యుని ఎన్నికకు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైన నేపథ్యంలో ఆ సభ్యుని ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించబడుతుందని భావించినప్పటికీ, కోరం లేకపోవడం వల్ల ఎన్నిక వాయిదా పడిందన్నారు. ఈ అంశాన్ని సవివరంగా పరిశీలించి మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు తగిన మార్గదర్శకాలు జారీ చేసి, కోఆప్షన్ సభ్యుని ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన వారిలో మెట్‌పల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆనంద్, బీజేపీ సీనియర్ నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, కలిగోట శ్రీకాంత్, బత్తుల జగదీశ్వర్, పాస్కంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలి

### వ్యవసాయ అధికారి రాజ్ కుమార్.



**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్వహించిన ధరకే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులు, స్టాక్ రిజిస్టర్, రైతులకు ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, ఎలాంటి అక్రమ నిల్వలు లేదా అధిక ధరలకు అమ్మకాలు చేయరాదని డీలర్లకు సూచించారు. అలాగే రైతులకు అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు అందించాలని, ప్రతి అమ్మకాన్ని తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎరువుల దుకాణాల్లో సరైన బోర్డులు ప్రదర్శించ డంతో పాటు స్టాక్ వివరాలను ఎప్పటి కప్పుడు నవీకరించాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శ కాలను కచ్చితంగా పాటించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలకు వాహనాల సంఖ్యను పెంచాలి

### లోడింగ్, అన్ లోడింగ్ మరింత వేగంగా చేయాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**సిరిసిల్ల బ్యూరో , మే 23, ప్రభాతవార్త** జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరం ఉన్న చోట వాహనాల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంచడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాల తరలింపునకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చేలా చూడాలని జిల్లా రవాణా శాఖ అధికారి ని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, అపరెల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హమాలీల సంఖ్య పెంచాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, సేవలు అందించాలని ఆదేశించారు. ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం




**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లా అభ్యర్థులకు విప్ ఆది శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్1, ఉపాధ్యాయ నియామకాలు సహా పలు ఉద్యోగ నియామక ప్రక్రియలు చేపట్టామని మరిన్ని ఉద్యోగ నియామకాలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని వారి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని, పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని, యువతి యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎంఆర్పీ ధరలకే ఎరువుల విక్రయించాలి

**కేతేపల్లి, ప్రభాతవార్త ,మే 23,** రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి బి. పురుషోత్తం హెచ్చరించారు. కేతేపల్లి మండలంలోని భీమారం, తుంగతుర్తి, ఇనుపాముల, కేతేపల్లి గ్రామాల్లోని ఆదీకృత విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను రోజువారీగా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒకే రైతుకు అధిక మొత్తంలో కాకుండా అవసరాన్ని బట్టి ఎరువులు విక్రయించాలని తెలిపారు. యూరియా బుకింగ్ కోసం రైతులు తమ ఫోన్ నంబర్లను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులతో అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు.

# మెట్‌పల్లి వార్త



## జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ను కలిసిన బీజేపీ నేతలు

**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :**



జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ని బీజేపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. పసుపు రైతుల సమస్యలు, పసుపు పంట అభివృద్ధి, రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు మార్కెటింగ్, ఎగుమతులు, గిట్టుబాటు ధరల విషయంలో మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్, బీజేపీ రాష్ట్ర నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు కలిగోట శ్రీకాంత్, బత్తుల జగదీశ్వర్, పాసిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడికి సర్పంచ్‌ల సన్మానం

**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:**



మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎండి రైసుద్దీన్‌ను బండలింగాపూర్ సర్పంచ్ లక్ష్మీ సంజీవ్, మేడిపల్లి సర్పంచ్ కడారి రాజేష్, చెర్లకొండాపూర్ సర్పంచ్ భాస ఆనంద్, కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, ముఖీం లు కలిసి శనివారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఎండి రైసుద్దీన్ కృషి చేస్తారని, పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకువస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎండి రైసుద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు కు అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తానని అన్నారు.

## గణపేశ్వరాలయం కోటగుళ్లలో క్లీన్ డే

**గణపురం, మే 23, ప్రభాత వార్త,**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా జిల్లా టూరిజం, పురావస్తు శాఖ లో ఆధ్వర్యంలో గణపేశ్వరాలయం కోటగుళ్లలో శనివారం క్లీన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కోటగుళ్లలో పరిసరాలను క్రీడాకారులు చెత్త చెదారం తొలగించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడి బుజ్జి సెక్యూరిటీ నల్లగొండ రాజు గౌడ్ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




# కాల్చితే కాలుష్యం కలియదున్నితేనే భూసారం

## వరి కొయ్యలను తగలబెడితే అపార నష్టంరైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక

**ముస్తాబాద్ ప్రభాత వార్త:**

వరికోతలు ముగిసిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలను,గడ్డిని దహనం చేయడం వల్ల భూమికి, పర్యావరణానికి తీవ్ర



నష్టం వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన లేమితో రైతులు చేస్తున్నఈ చిన్న పొరపాటు భవిష్యత్తులో పెద్ద నష్టాలకు దారితీస్తోంది.పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మట్టిలోని తేమ మొత్తం ఆవిరైపోతుం ది.అంతేకా కుండా,భూమికి అవసరమైన సేంద్రియ కర్బనమ్, నత్రజని,భాస్వరం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు మంటల్లో కాలిపోయి వృథాగా ఆవిరైపోతాయి. మంటల వేడికి భూమి పై పొరల్లో ఉండే పంటకు మేలుచేసే ఎన్నో సూక్ష్మజీవులు,వాన పాములు మరణిస్తాయి. అదేవిధ ంగాపొలంలో తిరిగే పాములు,వ ఋంగిసలు, ఉడుములు వంటి పర్యావరణానికి మేలు చేసే జీవరాశులు సైతం కాలి బూడిదవుతాయి.దీనివల్ల నేలగట్టిపడి,తదుపరి పంట వేయడానికి భూమిని దున్నడం కష్టమవుతుంది. వరి మాగిళ్లను కాల్చడం వల్ల విపరీతమైన పొగ,బూడిద గాలిలో కలిసిపోయి వాయు కాలుష్యం పెరుగుతుంది.ఈ కాలుష్యం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులకు ఊపిరితిత్తుల సమస్యలు,ఆస్తమా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి.అంతేకాకుండా పక్క పొలాల్లోని పంటలకు మంటలు వ్యాపించి పెను ప్రమా దాలు జరిగే అవకాశం ఉంది.రైతులు వరి కొయ్యలను కాల్చకుండా వ్యవసాయ యంత్రాలతో వాటిని చిన్న ముక్కలుగా చేసి,పొలంలో నీరు పెట్టి ట్రాక్టర్ రోటావేటర్ లేదా కేజ్ విల్



చక్రాలతోకలియదున్నాలి.దీనికి
ఎకరాకు 50 కేజీల సింగిలూపర్ ఫాస్పేట్ లేదా డీకంపోజర్ ను వాడితే, రెండు,మూడు వారాల్లో వరి కొయ్యలు కుళ్లిపోయి ఎకరానికి దాదాపు టన్ను వరకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువు తయారవుతుందని, దీనివల్ల తదుపరి పంట దిగుబడి 5 నుండి10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరి కొయ్యలను పొలాల్లో తగలబెట్టడం చట్టరీత్యా నేరమని,ఇలా నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.కావున, రైతులు వరి మాగిళ్లను కాల్చడం మానేసి, భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచుకోవాలని సూచిస్తున్నారు

## తంగళ్ళపల్లి గ్రామపంచాయతీకి వైకుంఠ రథం విరాళం

### సర్పంచ్ మోర లక్ష్మీరాజం అందజేత

**..తంగళ్ళపల్లి,ప్రభాతవార్త**

..తంగళ్ళపల్లి మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్ మోర లక్ష్మీరాజం తన సొంత ఖర్చులతో తన భార్య స్వర్గీయ విజయ పేరిట ఎన్నికల ముందు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తన సొంత ఖర్చులతో మూడు లక్షల రూపాయలు వెచ్చించి వైకుంఠ రథాన్ని గ్రామానికి విరాళంగా అందజేశారు.శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమీర్,పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో రథాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేద,మధ్యతరగతి కుటుంబాలు అంత్యక్రియల సమయంలో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎన్నికలప్పుడు వైకుంఠ రథం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి,ఇప్పుడు ఆ హామీ నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు.ఈ రథాన్ని గ్రామస్తులు వినియోగించుకోవచ్చు అని



పేర్కొన్నారు.అనంతరం గ్రామస్తులు ఎన్నికల్లో ఇచ్చిన మాట కట్టుబడి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ మోర లక్ష్మి రాజం ను శాలువాతో సత్కరించి అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర లక్ష్మీరాజం,ఉప సర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింగం గౌడ్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్,మాజీ జెడ్పీటిసి కోడి అంతయ్య,నాయకులు లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్,సామల రమేష్,సామల రమేష్, సుద్దాల కర్ణాకర్,సుద్దాల శ్రీనివాస్,రాపల్లి ఆనందం, అంకరపు మహేష్,పంచాయతీ కార్యదర్శి సమీర్,వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రామోజీపేటలో వి హెచ్ ప్రత్యేక పూజలు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

మండలములోని రామోజీపేటలో ప్రసిద్ధి గాంచిన శ్రీ సీతారాముల ఆలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,ప్రభుత్వ సలహా దారుడు వి హనుమంతరావు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.కుటుంబ సభ్యులతో వచ్చి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామి వారి దీవెనలతో ప్రభుత్వ సలహాదారుగా నియామకం అయినందుకు సంతోషంగా ఉందని వి హెచ్ పేర్కొన్నారు.ప్రతి యేడు స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూమయ్య, పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, నాయకులు సూర దేవరాజు,పసుల వెంకట్,జనార్దన్,ఆలయ



## కెనాల్ పనుల పూర్తికి సర్పంచుల వినతి

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



రంగనాయక సాగర్ ఎల్ ఎం 6 కాలువ పనులు పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీర్లకు ఆయా గ్రామాల సర్పంచులు శనివారం వినతిపత్రం అందించారు.వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా పెండింగ్ లో ఉన్న కాల్వ పనులు తక్షణమే పూర్తి చేయాలని వచ్చే వేసవి వరకైనా కాలువ పనులను పూర్తి చేయాలని కోరారు.ప్రభుత్వం 3.19 కోట్ల రూపాయలు కేటాయించిందని త్వరలోనే భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి పనులు మొదలు పెడతామని ఇంజనీర్లు హామీ ఇచ్చినట్లు సర్పంచులు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు గన్నేర వసంత నర్సయ్య,అంచ శ్రీనివాస్ రెడ్డి,ఆత్మకూరి జ్యోతి అనిల్,శ్యాగ విజయ దేవేందర్,నాయకులు ఎల్లవేణి రమేష్,గణపురం శ్రీనివాస్,కరికె నవీన్ కుమార్,బొనుగాని ప్రవీణ్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన.

**.తంగళ్లపల్లి,ప్రభాతవార్త**



..తంగళ్లపల్లి మండలం పాపయ్య పల్లె,లక్ష్మీపూర్, చింతలఠాణా,చీర్లవంచ,గోపాల్ రావుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.ఎంత తరలించారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల వేగవంతంగా చేయాలని సూచించారు. వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.ధాన్యం లోడింగ్, మిల్లులు,గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,రైతులు తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**ముస్తాబాద్ ప్రభాత వార్త:**

పదవ,ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన గూడూరు గ్రామ విద్యార్థులకు శనివారం గ్రామసర్పంచ్ చిటినేని సునీత వెంకటనరసింగరావు ఆధ్వర్యములో విద్యార్థిని, విద్యార్థులను సన్మానించి మెమోంటోలనుఅందజేశారు.ఈ కార్యక్రమములో గ్రామ ఉపసర్పంచ్ తాటకార్ల ప్రభాకర్,గ్రామ కార్యదర్శి చిరంజీ,ఉషా,కాసుల వదా శ్రీనివాస్,ఎదునూరీ శ్రీలత శ్రీనివాస్,వంగూరి లావణ్య కిషన్,పుల్లూరీ సంతోష్,యూత్ నాయకుడు వంగూరి దీలిప్,చెక్కపెల్లి వెంకటేష్,ఆంజనేయులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు అందజేత

**ముస్తాబాద్ ప్రభాత వార్త:**

నామపూర్ ఆదర్శ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం వెంకట్ ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యములో ఆదర్శ పాఠశాల విద్యార్థులను సన్మానించారు.ఒక్కొక్కరికి 3వేల రూపాయల నగదు ప్రశంసప త్రాలు,మెమోంటోలు అందజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కొండల్ రెడ్డి,విద్యార్థులు సాయి త్రిలోక్,తేజస్విని,శ్రీ హర్ష,శ్రీనిధి,జె శ్రీనిధి,విద్యార్థులు,తల్లి తండ్రులు,పాల్గొన్నారు.



జగిత్యాల వార్త

# వరి కొనుగోలు కేంద్రాల్లో అక్రమ వసూళ్లు ఆపాలి

## -ధర్మారం రైతుల ఆందోళన
## -లారీ ఎక్కించినా తాడు కట్టినా డబ్బులేనా?



**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని కోరుతూ జగిత్యాల మండలం రూరల్ ధర్మారం గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు.కొనుగోలు కేంద్ర నిర్వాహకుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల ఆరోపణల ప్రకారం, ధాన్యం తూకంలో 3కిలోల 800 గ్రాముల వరకు అదనంగా తీసుకుంటున్నారని,అలాగే లారీ ఎక్కించినందుకు,లారీ దించినందుకు,తాడు కట్టినందుకు,భూమి చదును కోసం అంటూ వివిధ పేర్లతో రైతుల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పెట్టుబడులతో నష్టాల్లో ఉన్న రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.రైతులను పట్టించుకునే నాధుడే లేడు మా కష్టానికి విలువ లేకుండా పోయింది అంటూ పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం బాధాకరమని వాపోయారు.కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టి,రైతులకు న్యాయం జరిగేలా జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని రైతులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి,రైతులపై అనవసర భారం మోపుతున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# తపోవన్ విద్యార్థికి రాష్ట్ర స్థాయి ర్యాంకు

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త**



తపోవన్ కోచింగ్ సెంటర్ విద్యార్థికి శనివారం ప్రకటించిన పాలీసెట్ ఫలితాలలో సుద్దాల ప్రజ్ఞ వికాస్ ఎం.పి.సి లో రాష్ట్రస్థాయిలో 285 ర్యాంకు మరియు ఏం.బై.పి.సిలో 81 ర్యాంక్ సాధించారు .ఈ అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ అనుమల్ల శ్యామ్ మరియు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గాజుల నర్సయ్య ఘనంగా సన్మానించారు. సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అగ్ని ప్రమాద బాధితులకు 10 ఎకరాల భూమి కేటాయించాలి

## బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**



జగిత్యాల మండలం రూరల్ నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం రోజున ప్రమాదవశాత్తు ఈత వనం కాలిపోవడంతో వందలాది గీత కార్మిక కుటుంబాలు ఉపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, గీత కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.ఒకసారి చెట్లు కాలిపోతే,అవి తిరిగి గీతకు సిద్ధం కావడానికి కనీసం 5 నుండి 6 ఏళ్ల సమయం పడుతుందని,ఈ దీర్ఘకాలంలో కార్మికులు ఎలా బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. గీత వృత్తి ఎంతో ప్రమాదకరమైనదని,అటువంటి వృత్తిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, నర్సింగాపూర్ సర్వే నంబర్ 437లో అందుబాటులో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని తక్షణమే గీత కార్మికులకు కేటాయించాలని ఆయన జిల్లా కలెక్టర్,ఎక్సైజ్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు.గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిపై ఉన్న నిబంధనలను సడలించి,కార్మికుల ఉపాధికి భరోసా కల్పించాలని కోరారు.నీరా కేఫ్‌ల ఏర్పాటు ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో ఎక్కడా అవి అమలు కాలేదని ఆయన ఎద్దేవా చేశారు.అదేవిధంగా,గ్రామాల్లో అక్రమ బెల్టు షాపుల దందాతో గీత కార్మికుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు.నర్సింగాపూర్‌లో 10కి పైగా బెల్టు షాపులు నిబంధనలకు విరుద్ధంగా,24 గంటలు ఆన్‌లైన్ సప్లైతో మద్యం ఏరులై పారిస్తున్నాయని ఆయన ఆరోపించారు.మద్యం దుకాణాల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే,ప్రజల అనారోగ్యం కోసం పేద కుటుంబాలు లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం బెల్టు షాపులను కఠినంగా నియంత్రించి,గీత కార్మికుల సంక్షేమానికి,వారి ఆరోగ్యకరమైన ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికులకు ప్రోత్సాహం కాగితాలకే పరిమితం కాకుండా,కార్యరూపంలో చూపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# దుబ్బ రాజన్న ఆలయ గోశాలకు గడ్డి కట్టలు వితరణ

**సారంగాపూర్ ప్రభాతవార్త:**



మండలంలోని పెంబట్ల కోనాపూర్ గ్రామ దుబ్బ రాజన్న స్వామి ఆలయ గోశాలలోని గోమాతల ఆకలి తీర్చేందుకు లక్ష్మిదేవి పల్లి గ్రామానికి చెంది కంచర్ల శ్రీనివాస్ గడ్డి కట్టలను వితరణగా అందించారు. దుబ్బ రాజన్న స్వామి ఆలయ గోశాలలోని గోవుల కోసం శనివారం ఆలయ ప్రాంగణంలో గడ్డి కట్టలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ, వేసవిలో గోవులకు మేత కొరత ఉన్న ఈ సమయంలో శ్రీనివాస్ చేసిన సాయం అభినందనీయమని, వారి కుటుంబానికి స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో దేవాలయ ఈవో వడ్లూరి అనూష ఆలయ వ్యవస్థాపకులు పోరండ్ల శంకరయ్య జూనియర్ అసిస్టెంట్ రజినీకాంత్ , లక్ష్మిరాజం, అర్చకులు సిబ్బంది, లక్షి మ్రదేవి పల్లి గ్రామ ఉప సర్పంచ్ మతలాపురం ఉపేందర్ కంచర్ల నరేష్ శివకుమార్ .వేణుగోపాల్ మహేష్ అంజియాదవ్ ,సాయికుమార్,జలేందర్ , ఆకాష్ , లింగారెడ్డి ,విష్ణు ,వెంకటేష్ రంజిత్ ,నరేష్ రాకేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ పోతే ఆందోళన చెందవద్దు.. వెంటనే ఫిర్యాదు చేయాలి

## -ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**
సెల్ ఫోను పోతే ఆందోళన చెందవద్దని అశోక్ కుమార్ పేర్కొన్నారుజగిత్యాల జిల్లాలో పోగొట్టుకున్న,చోరీకి గురైన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా,జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు 117 ఫోన్లను అందజేశారు. సుమారు 23 లక్షల రూపాయల విలువైన ఈ మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సమక్షంలో బాధితులకు అప్పగించారు.సెల్ ఫోన్ పోయినప్పుడు ఆందోళన చెందకుండా,కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్సైట్ లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు.మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ పోర్టల్ వినియోగంలోకి వచ్చిన నాటి నుండి జిల్లా వ్యాప్తంగా 3 కోట్ల 67 లక్షల రూపాయల విలువగల 1838 మొబైల్ ఫోన్లను గుర్తించి,యజమానులకు అందించడం జరిగింది. పోయిన ఫోన్ల విషయంలో అశ్రద్ధ వహించడం వల్ల అందులోని వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని,ఇది వ్యక్తిగత,సామాజిక భద్రతకు ముప్పు కలిగిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.నేరగాళ్లు చోరీ చేసిన ఫోన్లను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉన్నందున,ఫోన్ పోయిన వెంటనే పోలీసులను



సంప్రదించాలని కోరారు.సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేటప్పుడు,ఆ ఫోన్ యొక్క ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్‌లో తనిఖీ చేసి, దాని స్థితిని తెలుసుకోవాలని సూచించారు. అలాగే,అనుకోకుండా ఎవరికైనా ఫోన్లు దొరికితే, వాటిని సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం లేదా యజమానులకు తిరిగి ఇచ్చే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు.సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ఫోన్లను రికవరీ చేసిన సైబర్ క్రైమ్ ఐటి కోర్ బృందానికి ఈ సందర్భంగా రివార్డులు అందజేశారు.ఎటువంటి పరిస్థితుల్లోనూ అపరిచితులకు వ్యక్తిగత వివరాలు అందించవద్దని,ఒకవేళ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, సైబర్ క్రైమ్ ఎస్.ఐ దినేష్, సి ఈ ఐ ఆర్ బృందం సభ్యులు పాల్గొన్నారు.ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసుల పనితీరు పట్ల తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# విశ్వకర్మ మహాసభ డిస్ట్రిక్ట్ యూత్ కోఆర్డినేటర్‌గా ముమ్మిడి హరీష్ చారి నియామకం

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**



అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభ డిస్ట్రిక్ట్ యూత్ కోఆర్డినేటర్‌గా బ్రహ్మశ్రీ ముమ్మిడి హరీష్ చారి నియమితులయ్యారు.ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా సంతోష్ చారి మాట్లాడుతూ, ముమ్మిడి హరీష్ చారి గత ఎన్నో సంవత్సరాలుగా సమాజ సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటున్నారని కొనియాడారు.ఆపదలో ఉన్న ఎంతోమందికి తక్షణ సహాయ సహకారాలు అందిస్తూ సమాజంలో మంచి పేరు,గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయనలోని సేవా గుణాన్ని గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని విస్తృతమైన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతోనే ఈ కీలకమైన బాధ్యతను అప్పగించినట్లు స్పష్టం చేశారు.ఈ నియామకం పట్ల అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభకు చెందిన పలువురు కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కోఆర్డినేటర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాసభ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశ్విని కుమార్,జాతీయ ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ సుభాష్ చంద్రబోస్, జాతీయ వ్యవహారాల అధ్యక్షులు బ్రహ్మశ్రీ రామ్ రాజ్,జాతీయ యువజన విభాగం అధ్యక్షులు బ్రహ్మశ్రీ దిలీప్ కుమార్ శర్మ,జాతీయ అడ్వైజరీ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ చిన్మయ చారి తదితరులు పాల్గొని హరీష్ చారికి తమ ప్రత్యేక అభినందనలు అందజేశారు.తాము అప్పగించిన బాధ్యతలను హరీష్ చారి సమర్థవంతంగా నిర్వహిస్తూ,యువతను సేవా మార్గంలో ముందుకు నడిపిస్తారనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు.

# తుంగూరులో రాత్రి వేళ 'బడిబాట'..



**బీర్‌పూర్ ప్రభాత వార్త.** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం తుంగూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపిపిఎస్ తుంగూరు ప్రధాన ఉపాధ్యాయురాలు హేమలత ఆధ్వర్యంలో నిన్న రాత్రి వినూత్నంగా 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ప్రధాన ఉపాధ్యాయురాలు అకుంఠిత దీక్షతో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల తెలియజేపుతూ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు.రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు సాగిన ఈ ప్రచార కార్యక్రమానికి గ్రామ ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో మం డల విద్యాధికారి సిరిప నాగభూషణం, వార్డు మెంబర్ తిరుపతి, ఇంద్రాల లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ విజ యలక్ష్మి , ఉయ్యాల సంతోష్ , కిషన్, ఉయ్యాల రాజశేఖర్, మరియు పాఠ శాల ఉపాధ్యాయులు రజిత, జనార్ధన్, అక్షయ్ తదితరులు పాల్గొని, గ్రామస్థులకు విద్యా ప్రయోజనాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. రాత్రి వేళల్లో కూడా చొరవ తీసుకొని విద్యా వ్యాప్తికై కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, గ్రామస్తులు స్థానిక సర్పంచ్ పెద్దలు అభినందించారు.

# బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ వాక్సిన్ పంపిణీ..

**తిమ్మాపూర్, ప్రభాత వార్త :**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ (హెచ్ పి వి )ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దాదాపు 8 మంది బాలికలకు శనివారం



వ్యాక్సిన్ వేయటం జరిగింది గ్రామంలోని ప్రతి బాలిక ఆరోగ్యంగా, సురక్షి తంగా, ఉండాలని ఈ వ్యాక్సిన్ ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి మన బాలికలకు రక్షణ కలుగుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సజిదా అతారి, డాక్టర్ జావేరియా ఇమ్రోజ్, ఏఎన్ఎం పద్మ, వార్డు సభ్యులు బోయిని శంకరయ్య బావండ్ల ప్రవీణ్ కనపర్తి చంద్రశేఖర్ ఆశకార్యకర్తలు ఎలుక విజయలక్ష్మి ్మ, శ్వేత, కర్ర అరుణ, తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు.. కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి శనివారం కరీంనగర్ రేకుర్తి సాలె నగర్‌లో బక్రీద్ వేడుకల ఏర్పాట్లను



పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సిపి బక్రీద్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఎంత మంది హాజరవుతారు.. సౌకర్యాలు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టనున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, వేడుకలకు అవసరమైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పలు అంశాలను కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎండాకాలం దృష్ట్యా పెద్ద మొత్తంలో కూలర్లు ఏర్పాటు చేయాలని, అలాగే లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ మహేశ్వర్, తహసిల్దార్ వెంకటలక్ష్మి ్మతో పాటు ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ డాక్టర్స్ సెల్ అడ్వైజర్ గా కవ్వంపల్లి నియామకం.

**తిమ్మాపూర్, ప్రభాత వార్త :**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) డాక్టర్ సెల్ అడ్వైజర్ గా శ్రీశైలం రాష్ట్ర చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం నియామకపు ఉత్తర్వు జారీ చేశారు. డాక్టర్ ఏం. రాజీవ్ చైర్మన్ గా కొనసాగుతున్న డాక్టర్ సెల్ఫ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గౌరవ సలహాదారుగా, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను సలహాదారుగా నియమించారు. అలాగే వీరితో పాటు 16 మందిని సలహాదారులు నియమించడం జరిగింది.

# మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:**

ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు మహిళా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, సమన్వయంతో ఈ మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న మహిళా వారోత్సవాలపై మహిళా, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా వారోత్సవాల సందర్భంగా రోజూ వారీగా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను విజయవంతం




చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మే 25 వ తేదీన పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, సే నో టూ జంక్ ఫుడ్ పై అవగాహన, వంటల పోటీలతో పాటు గర్భిణీ స్త్రీలకు రక్తహీనత పరీక్షలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డులలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. మే 26 వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన తెలంగాణ లక్ష ్యంగా బాల్య వివాహం – బతుకు ఆగం పేరుతో బాల్య వివాహాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పోస్టర్లు, పాంప్లెట్లు, గోడలపై చిత్రలేఖనం, తదితర ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే గ్రామాలను గుర్తించి, మత పెద్దలు, కల్యాణ మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి, 1098, 181 సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి పాస్ బుక్ లు అందజేసి, సన్మానం చేయాలని ఆదేశించారు. మే 27 వ తేదీన మహిళల భద్రతపై అవగాహన కార్యక్ర ్మాలు, షీ టీమ్స్ సమన్వయం, కార్యాలయాల్లో నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులకు లోన్ మేళా నిర్వహించాలన్నారు. మే 29 వ తేదీన జిల్లాలో నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు, మెప్మా ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో క్యాంటీన్ ప్రారంభించాలని సూచించారు. ఈ నెల 30వ తారీఖున అమ్మ మాట అంగన్వాడి బాట పేరుతో అంగన్వాడి బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాలకు పంపించడానికి సర్టిఫికెట్లు అందజేయాలని అలాగే సూచించారు. అలాగే కొత్తగా అంగన్వాడీ కేంద్రాలకు కొత్త పిల్లల్ని చేర్చుకోవడం, పిల్లల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అశ్విని తనాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, డిఆర్డిఎ, పిడి గీత, డిపిఓ జగదీశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**మానకొండూర్, ప్రభాతవార్త:**

మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మజ్జిగ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది ఎండ తీవ్రత బాగా ఉన్నందున ఎండల పట్ల ఉపాధి హామీ కూలీలు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనిచోట ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, కారోబార్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్, కూలీలు పాల్గొన్నారు.



# కరీంనగర్ వార్త

# ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభం

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:**

కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయడానికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను శనివారం



ప్రారంభించారు. ఎక్కువగా గ్రానైట్ పరిశ్రమల్లో కార్మికులు పనిచేస్తున్నందున కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ముందుగా ప్రారంభించినట్లు కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నేపాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి వచ్చి స్థానికంగా నివసిస్తున్న కార్మికుల వ్యక్తిగత వివరాలు, నివాస చిరునామాలు, ఉపాధి వివరాలను సేకరించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లి స్టేషన్ హౌస్ అధికారి ట్రైనీ ఐపిఎస్ సోహం సునిల్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం వలస కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కార్మికులకు అవగాహన కల్పిస్తూ వారి వివరాలను నమోదు చేశారు.

# విధుల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి

## ఏసీపీ (ఏ.ఆర్.) ప్రతాప్

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:**

ప్రజాప్రతినిధులు, వీఐపీల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పీఎస్ఓలు, బాంబ్ డిస్పోజల్ , డాగ్ స్క్వాడ్ సిబ్బంది అత్యంత అప్రమత్తత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని ఏఆర్ ఏసీపీ ప్రతాప్ ఆదేశించారు. శనివారం కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని తన కార్యాలయంలో ఏఆర్ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రామాణిక విధానాలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. విభాగాల వారీగా ఆయన సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు: వీఐపీల భద్రతనే ప్రథమ కర్తవ్యంగా భావించాలి. ఆయుధాల నిర్వహణ, రూట్ చెకింగ్, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. వీఐపీల ప్రయాణ ప్రణాళికల గోప్యతను ఖచ్చితంగా పాటించాలి. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ సాంకేతిక పరిజ్ఞానం, మానసిక దృఢత్వం, సమయస్ఫూర్తితో పనిచేయాలి. ఈ విభాగంలో జరిగే చిన్న పొరపాటైనా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్త వహించాలి. డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్లు తమ శునకాల పట్ల ప్రేమ, ఓపికతో వ్యవహరిస్తూ వాటి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణే విజయానికి మూలమని, ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఏసీపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (అడ్మిన్) రజినీకాంత్, ఆర్ఎస్సైలు నీలవేణి రాజు, కార్తీక్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన వొడితల ప్రణవ్..

**జమ్మికుంట / హుజూరాబాద్, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త తన కుటుంబంగా భావించి, కార్యకర్తలకు ఆపద వస్తే ముందుండి ఆ కుటుంబానికి పెద్ద దిక్కులాగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



నిలబడ్డారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి యాభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రణవ్ జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురికాగా వారిని నాయకులు ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మాలో ఒకడిగా ఉన్న సలీం పాషా మరణం బాధాకరమని, కార్యకర్తలకు భరోసాను ఇస్తూ హుజూరాబాద్ ఇంచార్జి ప్రణవ్ బాబు కుటుంబానికి అండగా నిలబడడం ద్వారా కష్ట సమయంలో కుటుంబానికి అండగా మానవతావాదిగా ఉంటారని తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ...

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;**

జమ్మికుంట పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోఎండ



తీవ్రతను దృష్టిలో ఉంచుకొని భక్తులకు వికాస తరంగిణి జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణి చేశారు. ఎండ తీవ్రత నుండి భక్తులకు కొంత మేర ఉపశమనం కలుగుతుందనే ఉద్దేశంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. మజ్జిగ ధాత కల్వల దీప్తి కిషనరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వికాస తరంగిణి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

## మానవత్వం పరిమళించిన వేళ...

### "మండుటెండలో మతిస్థిమితం లేని మనిషికి,సహాయం చేసి మానవత్వం చాటిన రాజు, ప్రభు...

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;**

గత కొన్ని నెలలుగా మండుటెండలో జమ్మికుంట ఫ్లైఓవర్ పైన నివాసాన్ని ఏర్పరచుకొని జీవిస్తున్న వ్యక్తిని గమనించిన అంతర్జాతీయ క్రీడాకారులు , జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు,వోజ్జ రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) లు ఆయన వద్దకు చేరుకొని ఆయనకి ఆహారం నీళ్ల బాటిల్ అందజేసి,మానవత్వాన్ని చాటుకున్నారు.అతనితో



మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.అతని స్వగ్రామం జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన ప్రశాంత్ గా చెప్పారు.గత కొంతకాలంగా మానసిక స్థితి బాగుండకపోవడంతో పిచ్చివాడిలా ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనే రాత్రింబవళ్లు జీవనం గడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు రాజు, ప్రభు మాట్లాడుత ూజమ్మికుంట ఇన్స్పెక్టర్, తాసిల్దార్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకొని వారి కుటుంబ సభ్యులను పిలిపించి, మానసిక రోగిగా మారిన ప్రశాంత్ ను హైదరాబాదులోని ఎర్రగడ్డ (పిచ్చాసుపత్రి) వైద్యం చేయిస్తే సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యవంతులుగా అవుతారని, ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వాళ్ళు అవుతారని విజ్ఞప్తి చేశారు.

## వలస కూలీల వివరాలు సేకరణ..

**ఇల్లందుకుంట, ప్రభాతవార్త:**

ఇటీవల జరుగుతున్న నేరాల దృష్ట్యా జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ఇల్లందకుంట ఎస్సై తో కలిసి ఇల్లందకుంట మండలంలోకి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కూలీల వివరాలు సేకరించారు. వారి యొక్క ఫింగర్ ప్రింట్స్ తనిఖీ చేసారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వలస కూలీల వివరాలు సంబంధిత యజమానులు ఇల్లందకుంట పోలీసులు వారికీ తెలియ



జేయాలని, నేపాల్ దేశం నుంచి వచ్చిన వక్తుల వివరాలు, వారితో సక్రమంగా ఉండాలని సూచించారు. ఇటుకబట్టిలో పనిచేసే కూలీల వివరాలు సేకరించి, ఇప్పటికప్పుడు యజమానులు వలస కూలీల వివరాలు ఇల్లందుకుంట పోలీస్ స్టేషన్ లో అందించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుకుంట ఎస్సై క్రాంతి కుమార్ తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కమలాపూర్ మండలంలో కొయ్యకాళ్ల మంటల బీభత్సం

### మామిడి తోట, తాటి వనం బుగ్గి

**కమలాపూర్: ప్రభాతవార్త.**

కమలాపూర్ మండలంలో వరి కొయ్యకాళ్లను తగలబెట్టే నిరక్ష్యప్ల చర్య రైతుల పాలిట శాపంగా మారింది. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో వేసిన నిప్పు రైతుల జీవనాధారాన్ని కాల్చేస్తోంది.మర్రిపల్లిగూడెం గ్రామ శివారులో ఓ రైతు పొలంలోని కొయ్యకాళ్లకు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న గూడూరు గ్రామవాసి అయిన చేన్నబోయిన మూర్తి కి చెందిన 5 ఎకరాల మామిడి తోటకు మంటలు అంటుకున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలతో నిండిన తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. కళ్లముందే తోట కాలి బూడిదవ్వడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. దాదాపు రూ.3 లక్షల విలువైన పంట నష్టం వాటిల్లిందని, ఏళ్ల తరబడి పెంచిన తోట ఒక్కసారిగా కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా కమలాపూర్ పట్టణ కేంద్రంలో ఎల్లమ్మ ఆలయం నుంచి కన్నూరు రహదారి మార్గంలో దుబ్బల ప్రాంతంలో ఉన్న భారీ తాటి వనం కూడా కొయ్యకాళ్ల మంటలకు బలైంది. ఈ ప్రమాదంలో 1000 తాటి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అందులో కల్లు



గీసుకుంటున్న 100కి పైగా తాటి చెట్లు సైతం దగ్ధమయ్యాయి. తాటి చెట్లనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న గీత కార్మికులకు ఇది తీరని దెబ్బ. రోజువారీ ఉపాధి ఒక్కసారిగా కోల్పోయి గౌడన్నలు రోడ్డున పడ్డారు.

**రైతుల ఆవేదన:**

పంట కోతలు పూర్తయిన తర్వాత కొయ్యకాళ్లను తగలబెట్టడం ఆనవాయితీగా మారిందని, అయితే ఒక్క నిప్పు రవ్వ పక్క పొలాల్లోని తోటలను, చెట్లను బూడిద చేస్తోందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు కొయ్యకాళ్ల తగలబెట్టకుండా రైతుల్లో అవగాహన కల్పించాలని, నష్టపోయిన రైతులను, గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హుజూరాబాద్ వార్త



## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ.

**వీనవంక,ప్రభాత వార్త:**



వీణవంక మండలము లో నీ దేశాయి పల్లి గ్రామములోని బంజరు కుంటలో బుధవారం వంద మంది ఉపాధి కూలీల మట్టి తీత పనులు చేస్తున్నారు.ఎండ వేడి నుంచి కూలీలకు దాహార్తిని తగ్గించేందుకు ఆ గ్రామ సర్పంచ్ యార్ల శ్రీనివాస్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశాడు.దీంతో కూలీలు ఆనందం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.

## రసాయనిక ఎరువులు వద్దు... సేంద్రియమే ముద్దు....!

**-- భూమిని కాపాడుకుందాం.. దిగుబడులు పెంచుకుందాం**

**-- పచ్చిరొట్ట ఎరువులతోనే అధిక లాభాలు**

**-- సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి**

**జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:**

రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం క్షీణిస్తోందని, రైతులంతా రసాయనాలకు స్వస్తి పలికి, సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, రసాయనిక ఎరువులు వద్దు... సేంద్రియమే ముద్దు అని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, మండల వ్యవసాయ అధికారి భూమ్ రెడ్డిలతో కలిసి కొండల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రైతులకు విత్తన బస్తాలను పంపిణీ చేశారు.

**-- జీలుగతో భూమికి అమృతం... పంటకు బలం.... కొండల్ రెడ్డి**

ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువుల వల్ల ఆశించిన మేర దిగుబడులు వస్తాయని నొక్కి చెప్పారు. జీలుగ విత్తనాలను పంట పొలాల్లో చల్లుకుని, అవి పెరిగిన తర్వాత కరెక్టుగా 45 రోజులకు పొలంలోనే కలియదున్నాలని రైతులకు సూచించారు. దీనివల్ల భూమికి అవసరమైన నత్రజని, ఇతర పోషకాలు సమృద్ధిగా లభించి భూమి అత్యంత సారవంతంగా మారుతుందన్నారు. రసాయనాల ఖర్చు తగ్గి, తక్కువ పెట్టుబడితోనే నాణ్యమైన, అధిక దిగుబడి సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ... రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి భూమ్‌రెడ్డి మాట్లాడుతూ... హుజూరాబాద్ మండలానికి ప్రభుత్వం 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించిందని తెలిపారు. మార్కెట్‌లో 30 కేజీల బస్తా ధర రూ. 2,452లుగా నిర్ణయించబడిందని, దీనిపై రైతులకు నిబంధనల ప్రకారం రాయితీ లభిస్తుందని వివరించారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు తమ వెంట కింది పత్రాలను తీసుకురావాలని అధికారులు సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ప్రభుత్వ గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ, ఈ పత్రాలతో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

**-- చెల్పూర్ సొసైటీలోనూ పంపిణీ..**

మండల పరిధిలోని చెల్పూర్ సొసైటీలో సైతం శనివారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్, డీసీఎంఎస్ ఇంచార్జి రమేష్, జూపాక సింగిల్ విండో చైర్మన్ అనుమాండ్ల శ్యాం సుందర్ రెడ్డి, ఇతర వ్యవసాయ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# పదవి పరిరక్షణ కోసం వ్యక్తిగత విమర్శలా..?

శిలాఫలకాలే తప్ప అభివృద్ధి శూన్యం.

'కామన్ రకం' పేరుతో ధాన్యానికి రూ.20 కోత

ఆరుగాలం శ్రమించిన రైతుకు గిట్టుబాటు ఎక్కడ : బీఆర్ఎస్ నేతలు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నాయకులు పారుపల్లి గుణపతి, హనుమాల బాపూరావు, మైలారం నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ప్రస్తుత గ్రంథాలయ చైర్మన్ వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిపై నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. గతంలో జరిగిన పలు అంశాలపై ప్రజలకు వాస్తవాలు తెలుసునని పేర్కొన్నారు.గతంలో సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో పలు అక్రమాలు, ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. హమాలీల నుంచి కమిషన్లు తీసుకోవడం, పలు ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలు, గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలు చేశారు. అలాగే కొన్ని వ్యవహారాల్లో ప్రజల వద్ద డబ్బులు సేకరించి పూర్తిస్థాయిలో తిరిగి చెల్లించలేదని విమర్శించారు.పదవిని కాపాడుకోవడం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఇకపై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుతం శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుంటూ ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. శిలాఫలకాలే తప్ప కొత్త అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు.రైతుల సమస్యలపై కూడా బీఆర్ఎస్ నేతలు స్పందించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు.సూపర్ ఫైన్ ధాన్యానికి సరైన ధర ఇవ్వాల్సి ఉండగా, అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై కామన్ రకం పేరుతో ధాన్యం కొనుగోలు చేస్తూ క్వింటాల్‌కు రూ.20 వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లలో రైతుల సొమ్ము ఎక్కడికి వెళ్తోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ కూకట్ల గోపి, నాయకులు పసిడ్ల సంపత్, తిప్పారపు దయాకర్, గందే మల్లికార్జున్, పోల్సాని శ్రీనివాస్, మహమ్మద్ రఫీక్, ఎండి వహీద్, కాంపల్లి రాజు, చొప్పరి అరుణ్ కుమార్, ఆరేపల్లి సర్వేశ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోడు పట్టించుకోరా

-మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



వడ్లు మక్కల కొనుగోలు కేంద్రాలలో గత నెల నుండి కాంటాలు వేగవంతంగా నడవకపోవడంతో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారని రైతుల గోడు ఎవరు పట్టించుకోవడంలేదని మండల మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవులు అన్నారు శనివారం మండల కేంద్రంలోని మక్కల వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకుని రైతులతో కలిసి సుల్తానాబాద్ పెద్దపల్లి రహదారిపై ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ ప్రభుత్వం ఉన్నప్పుడు లేనిపోని మాటలు చెప్పి, మా ప్రభుత్వం వస్తే మేము బాగా చేస్తామని, గింజ కటింగ్ రాకుండా చేస్తామని చెప్పారు. కానీ 40 కిలోల 650 గ్రాములు పెట్టవలసిన వడ్లు, 41న్నర పెడుతున్నారు. 41న్నర అంటే ఒక బస్తాకు 850 గ్రాములు పోతుంది. రెండు బస్తాలకు వచ్చేసి ఒక కిలో 800 గ్రాములు పోతుంది. క్వింటాల్ కు రెండు కిలోలు కటింగ్ అవుతుంది, అది ఎవరికీ తెలియకుండా కటింగ్ అవుతుంది.ఎక్కువ తూకం పెట్టి రైతులను నిండా ముంచుతున్నారు మీరు రైతులను ఆదుకునే ప్రభుత్వమా లేక రైతాంగాన్ని నడ్డి విరిచే ప్రభుత్వమా అని మేము అడుగుతున్నామన్నారు జిల్లా కలెక్టర్ రైతులు లేని టైమ్ లో వచ్చారు. రైతులు ఉంటే ఎక్కడ నిలదీస్తారో అనే ఆలోచనతో ఆదివారం పూట వచ్చి చూసి వెళ్ళిపోతారు. మొక్కజొన్న రైతులనైతే మీరే సంచులు తెచ్చుకోవాలి, మీరే నింపుకోవాలి, మీరే పట్టుకొచ్చుకోవాలి అనే ధోరణి నడుస్తుంది. మార్క్ ఫెడ్ ద్వారా కొనే మొక్కజొన్నలు కావచ్చు, మార్క్ ఫెడ్ వాళ్లే సంచులు ఇవ్వాలి, సుతులు ఇవ్వాలి. కానీ ఈ ప్రభుత్వంలో ఎంత దారుణం అంటే, రైతే సుతులు, బార్దాన్ కొనుక్కునే పరిస్థితి వచ్చింది. రైతు అహర్నిశలు కష్టపడి మార్కెట్లో సుఖంగా అమ్ముకునే టైంలో, వాళ్ళు బార్దాన్ వెతుక్కునే పరిస్థితి వచ్చింది.మేము ఒక్కటే కోరుతున్నాం, రోహిణి కార్తి దగ్గర పడుతుండటం వర్షాలు పడితే రైతు అధోగతి అవుతాడని సంబంధిత అధికారులు కలగజేసుకొని త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో రైతులు బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# వార్డుల్లో పెండింగ్ పనులన్నీ వీలైనంత తొందరలోనే పూర్తి చేస్తాం

-పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

-పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పెద్దపల్లి, ప్రభాతవార్త:

వార్డుల్లో పెండింగ్ పనులన్నీ వీలైనంత తొందరలోనే పూర్తి చేస్తామని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య హామీ ఇచ్చారు. శనివారం పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 9, 28, 21 వార్డులలో శానిటేషన్ పనులను వార్డు కౌన్సిలర్లతో కలిసి పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును, వీధుల క్లీనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలన పర్యటనలో వార్డుల ప్రజలు పలు పెండింగ్ సమస్యలను, డ్రెయినేజీ, పారిశుద్ధ్య లోపాలను పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనిపై మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య



సానుకూలంగా స్పందిస్తూ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ, రోడ్లు, ఇతర సమస్యలను వీలైనంత తొందరలో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులన్నీ పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నాదీమ్, తూముల లత శుభాష్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, జవాన్ చిన్న, ఇతర మున్సిపల్ సిబ్బంది, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దపల్లి వార్త



# మెరుగైన సేవలు అందించేలా కార్యాలయ భవనం సిద్ధం కావాలి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పాలకుర్తి మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కార్యాలయ భవనం సిద్ధం కావాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం పాలకుర్తి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాలకుర్తి మండల ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా నిర్మిస్తున్న ఈ నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని, జూన్ 10 నాటికి అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయ నిర్వహణకు అత్యంత కీలకమైన విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీ, తాగునీటి సౌకర్యం తదితర అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా అదే గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత అధికారులు తరచూ నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనులను పర్యవేక్షిస్తూ పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేలా కార్యాలయ భవనం అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఈఈ పీఆర్ శంకరయ్య, తహసీల్దార్ సునీత తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు అరటిపండ్లు పంపిణీ చేసిన సర్పంచ్

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలం తేలుకుంట గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నటువంటి జిల్లా యోజన,క్రీడా శాఖ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో తైక్వాండో వేసవి క్రీడా శిక్షణ శిబిరంలోని పిల్లలకు గ్రామ సర్పంచ్ నాంపల్లి సంపత్‌కుమార్ అరటిపండ్ల ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి క్రీడలను విద్యార్థులు చక్కగా వినియోగించుకొని రాష్ట్రస్థాయి,జాతీయస్థాయి పోటీలలో పాల్గొని పథకాలు సాధించి,తేలుకుంట గ్రామానికి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రవీందర్,పిఈటి రమేష్,గ్రామ వార్డు సభ్యులు తిరుపతి, కోచ్ నేవూరి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# సినీ నటుడు సుమన్ నియామకం పట్ల హర్షం

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి తాళ్ల కళ్యాణ్

హైదరాబాదులోని నివాసంలో సుమన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన యువ నాయకుడు

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తెలుగు సినీనటుడు సుమన్ నియామకం పట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి అసిస్టెంట్ డైరెక్టర్ విభాగం, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తాళ్ల కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాదులోని సుమన్ నివాసంలో మర్యాదపూర్వకంగా వారిని కలిసి తాళ్ల కళ్యాణ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాళ్ల కళ్యాణ్ మాట్లాడుతూ సినీ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగి, ఏ క్యారెక్టర్ నైనా తనదైన శైలిలో, అద్భుత నటనతో తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాలలో సుమన్ తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుమన్‌కు ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ సంబంధ రంగాల్లో పురోగతి కోసం ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడుతూ చిత్తశుద్ధితో కృషి చేస్తానని, సినీ కార్మికుల శ్రేయస్సు కోసం తన వంతు బాధ్యత నిర్వహిస్తానని ఈ సందర్భంగా సుమన్ తనతో తెలియజేశారని తాళ్ల కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## ఎస్సారెస్పీ బ్రిడ్జిని పరిశీలించిన పాలకవర్గం



**చొప్పదండి,ప్రభాతవార్త:**

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ మీదుగా పొగురు మామిడి కుంటకు వెళ్లే ప్రధాన రహదారి ఎస్సారెస్పీ డి 86 దాటేందుకు ఉన్న ప్రధాన బ్రిడ్జి పురాతన కాలంలో నిర్మించడంతో ప్రస్తుతం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో శనివారం చొప్పదండి చైర్ పర్సన్ వడ్లూరీ సరిత శ్రీనివాస్, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు కొట్టే సునీత అశోక్, కొత్త సుమలత గంగారెడ్డి, గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేష్ లో డి 86 ప్రధాన కాలువపై ఉన్న చెడిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ తో పాటు కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇప్పటికే 54 లక్షల ప్రపోజల్తో కూడిన ప్రతిపాదన మంజూరీ కావడం జరిగిందని, కానీ పెరిగిన ధరల ప్రకారం బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన వివిధ రకాల మెటీరియల్ కు ధరలు పెరగడంతో నిర్మాణ వ్యయం పెరుగుతుండడంతో తిరిగి 85 లక్షలతో కూడిన ప్రతిపాదనలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇప్పటికే పంపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఫైలు ఫైనాన్స్ మినిస్టర్ వద్ద ఉందని త్వరలో నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసే దశలో ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## చలివేంద్రం లో కోతుల అడ్డా నీళ్లు తాగితే ఆస్పత్రికే,,

**,,!మల్యాల /ప్రభాతవార్త**



ఈ వేసవిలో మల్యాల పట్టణానికి వచ్చి పోయే ప్రజల దాహార్తి తీర్చాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మల్యాల అంగడి బజార్ లోని చలివేంద్రం వద్ద ప్రవాద ఘంటికలు మోగుతున్నాయి, ప్రజలకు సురక్షిత చల్లని నీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రం కాస్త కోతులకు షెల్టర్ కావడమే కాదు ఏకంగా నీటి కుండలపై సేద తీరుస్తున్నాయి, ఈ చిత్రం చూస్తే ఆ నీళ్ల తాగితే పరిస్థితి ఏమవుతుందో అర్థం అవుతుంది, చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని నీటి కుండలు ఏర్పాటు చేయడం బాగానే ఉన్నా, అక్కడ నీటిని అందించేందుకు కోతుల నుండి రక్షణకు ఓ వ్యక్తిని కూడా నియమిస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు, లేకుంటే చలివేంద్రం పెట్టి ప్రయోజనం లేదు కదా కోతుల విన్యాసాలతో కంపు నీటిని తాగిన అమాయక వ్యక్తుల ఆరోగ్యానికి హానికరంగా మారకముందే జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని స్థానికులు సూచిస్తున్నారు

## కొండగట్టు అంజన్న సేవలో ఎస్పీ అశోక్ కుమార్

**మల్యాల /ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాన్ని శనివారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కుటుంబ సభ్యులతో వచ్చి సందర్శించారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికి అనంతరం ఆలయంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఎస్ పీ కి వేదమంత్రాలతో స్వామి వారి శేష వస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందించి ఆశీర్వదించారు, కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్, ఎస్ఐ నరేష్ కుమార్ పాల్గొన్నారు,



## గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



**మల్యాల /ప్రభాతవార్త**

మల్యాల మండలం తక్కల్లపల్లి లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఈతవనం, గడ్డి వాములు కాలిపోయిన సంఘటనలో బాధిత గీత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కోరారు , శనివారం ఆయన బాధిత కుటుంబాలతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు, ఈత వనం పైనే ఉపాధి పొందుతున్న దాదాపు 150 గీత కార్మిక కుటుంబాలు అగ్ని ప్రమాదంలో చెట్లు కాలిపోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు, ఎండాకాలంలో తరచూ తాటి, ఈత వనాలు అగ్నికి ఆహుతి అవుతున్న నేపథ్యంలో కలెక్టర్, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని, అంతేకాకుండా నష్టపోయిన వనం సర్వే చేసి, నూతన మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అలాగే బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు,

## పెన్షనర్లు తప్పనిసరి ఈ కేవైసీ చేయించుకోవాలి



**చొప్పదండి,ప్రభాతవార్త:**

పెన్షన్ లబ్ధిదారులకు సంబంధించిన ముఖచిత్ర ధ్రువీకరణ ఈ కేవైసీ ప్రక్రియను ప్రతి ఒక్కరు పూర్తి చేసుకోవాల్సిందిగా మునిసిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఒకటో వార్డులో చైర్పర్సన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డుల పరిధిలోని వారి ఇళ్లలోకి స్వయంగా వెళ్లి ప్రత్యేక అధికారుల ద్వారా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ కేవైసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చైర్పర్సన్ సరిత తెలిపారు. దివ్యాంగులు ఎవరు ఉన్నా కానీ ఆయా వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన ఈ కేవైసీ కేంద్రాల వద్దకు వచ్చి ముఖచిత్ర ధ్రువీకరణ చేయించుకోవాల్సిందిగా సరిత కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16 నుండి జూన్ 15 వరకు ఈ కేవైసీ పెన్షన్ దారులు తప్పనిసరిగా చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ఉద్దేశంతోనే వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకూడదని వారి ఇంటికి వెళ్లి ఒకటో వార్డులో ఈ కేవైసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చైర్పర్సన్ సరిత పేర్కొన్నారు. అన్ని వార్డులలో కూడా ఆయా అవార్డుల కౌన్సిలర్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని ఆ వార్డులకు కేటాయించిన అధికారుల ద్వారా ఈ కేవైసీ కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని పెన్షన్ దారులు తప్పనిసరి వినియోగించుకోవాలని సరిత కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీధర్ రెడ్డి, ధరమ్ సింగ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇంచార్జ్‌గా తిరుపతి

**చొప్పదండి,ప్రభాతవార్త:**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ గా చొప్పదండి మండలం రుక్మాపూర్ కు చెందిన మ్యాకల తిరుపతిని నియమిస్తూ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మే20 నుంచి జూన్ 20వరకు నిర్వహించ నున్న "జెండా పండుగ" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి వరకు ఘనంగా నిర్వహిం చాలని పార్టీ శ్రేణులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మ్యాకల తిరుపతి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ప్రజా సమస్యలపై పార్టీ విధానాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చొప్పదండి వార్త



## ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే పాలకవర్గ లక్ష్యం



**చొప్పదండి,ప్రభాతవార్త:**

పట్టణంలోని పలు వార్డులలో ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యంగా పాలకవర్గం ముందుకు సాగుతుందని చొప్పదండి మునిసిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఒకటో వార్డులో తాగునీటి అవసరాలపై ప్రజలు ఆర్చి పెట్టుకోగా శనివారం తగురుమాడికుంటలో కొత్తగా సి ఆర్ ఐ 5 హెచ్ పి వి 4 12 స్టేజ్ బోరు మోటర్ ఏర్పాటు చేశారు. మోటారు ఏర్పాటు చేసి నీటిని విడుదల చేయడంతో స్థానిక ప్రజల అవసరాల కనుగుణంగా నేటి సరఫరా మరింత మెరుగుపడింది. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా తాగునీటి అవసరాలకై చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ సరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మహానస గంగయ్య, కౌన్సిలర్లు కొట్టే సునీత అశోక్, గుర్రం రాజేందర్ రెడ్డి, కొత్త సుమలత గంగారెడ్డి, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న నిత్యాన్నదాన సత్రం కు లక్ష విరాళం



**మల్యాల/ ప్రభాతవా**

మ్తంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటి గూడ కు చెందిన ఉప్పు కిరణ్ శ్రీలత దంపతులు శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు లోని శ్రీ అంజన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, భక్తులకు ఆలయంలో భక్తులకు ఉచిత అన్నదానం నిమ్నిత్త నిత్యాన్నదానంకు ఒక లక్ష రూపాయలు విరాళంగా అందజేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు, ఈ సందర్భంగా విరాళం అందజేసిన దంపతులకు ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీ మారుతీ ప్రసాద్ శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందించారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**మల్యాల /ప్రభాతవార్త**

మల్యాల మండలంలోని తక్కల పెళ్ళికి చెందిన గొడుగు మల్లవ్వ, నారవేణి శంకర్ లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు, అంతేకాకుండా గ్రామానికి చెందిన టిఆర్ఎస్ కార్యకర్త కోనాపురం బాబు తల్లి ఆరోగ్యం బాగా లేనందున వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు, కార్యక్రమంలో నాయకులు జనగాం శ్రీనివాస్, తక్కలపల్లి మాజీ సర్పంచ్ గొడుగు కుమారస్వామి, మంద మహేష్ వార్డు మెంబర్లు ఉత్తం గంగాధర్, దొనకంటి రమేష్, పులి సుధాకర్, కందుల మల్లన్న, రాజు, అశోక్, రాజయ్య, మిట్టపల్లి దశరథం ,అరుణ్ పాల్గొన్నారు

# ఫించన్లు నిరాంటకంగా అందాలనే వెరిఫికేషన్ ప్రక్రియ

– వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ, ప్రభాతవార్త:

లబ్ధిదారులకు ఫించన్లు నిరాంటకంగా అందాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టిందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత ఫించన్ల లైవ్ అథెంటికేషన్, ధ్రువీకరణ ప్రక్రియ వేములవాడలో ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం స్థానిక 4వ వార్డులో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను వార్డు కౌన్సిలర్ తోట రాజుతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల బయోమెట్రిక్ వివరాల నమోదును పర్యవేక్షించి, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, లబ్ధిదారులందరూ



అప్రమత్తంగా ఉండి గడువులోగా వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులున్నారు.

# వేములవాడ రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సోయనేని కరుణాకర్ ను శనివారం పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. గతంలో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలందించిన ఆయన గ్రామ అభివృద్ధితో పాటు మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని క్రమశిక్షణతో అమలు చేస్తూ, పార్టీకి విధేయుడిగా పనిచేసినందుకే అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించిందన్నారు.అలాగే గౌరవ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆశయ సాధన కోసం కృషి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని సోయనేని కరుణాకర్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుర్రం విద్యాసాగర్, చెట్ల తిరుపతి, పోరెడ్డి రవీందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ

**–పాలీసెట్–2026లో రాష్ట్ర స్థాయిలో 130వ ర్యాంక్**

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

విడుదలైన పాలీసెట్–2026 ఫలితాల్లో పి.ఎం.శ్రీ జెడ్పిహెచ్‌ఎస్ హనుమాజీపేట పాఠశాలకు చెందిన విద్యార్థి మల్లే వెంకటేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 130వ ర్యాంక్ సాధించాడు. మొత్తం 120 మార్కులకు గాను 116 మార్కులు సాధించి పాఠశాలకే కాక గ్రామానికి కూడా గర్వకారణంగా నిలిచాడు.గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వెంకటేష్ క్రమశిక్షణతో చదువుతూ ఈ విజయాన్ని అందుకోవడం విశేషమని



ఉపాధ్యాయులు తెలిపారు.విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ చిట్నేని శ్రీకాంత్ రావు ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థి నిరంతర కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ ఫలితానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వెంకటేష్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జంకె మధు, పాఠశాల పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థులు వరుసగా రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించడం హనుమాజీపేట పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# గౌరవ వేతనం వద్దు .. కనీస వేతనం కావాలి



**ప్రభాతవార్త కోనరావుపేట** గౌరవ వేతనం వద్దు కనీస వేతనం కావాలని ఉద్యోగ భద్రత కల్పించాలని బుధవారం కొనరావుపేట మండల కేంద్రంలో ఐకేపీ, వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సెర్ప్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో నిరవధిక సమ్మె నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటు 58 జీఓను సవరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఐకెపి వివో ఏలు పాల్గొన్నారు

# సబ్ స్టేషన్ నిర్మాణానికి సహకరించాలి

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి చేయాలని లింగంపేట రైతులు అన్నారు,ట్రస్ట్ పేరుతో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు శనివారం చందుర్తి డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగంపేట లో 3కోట్ల 52 లక్షల 10వేల తో మంజూరైనా సబ్ స్టేషన్ ను ప్రభుత్వ భూమిలో నిర్మిస్తుండగా కొందరు ట్రస్ట్ పేరు తో అడ్డుకోవాలని చూస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారుఈ కార్యక్రమం లో లింగంపేట గ్రామ రైతులు పాల్గొన్నారు...

# అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

–మైనింగ్ ఏడి క్రాంతి కుమార్–వార్త కథనానికి స్పందన

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా గనులు, భూగర్భ శాఖ ఏడి క్రాంతి కుమార్ హెచ్చరించారు. శనివారం పల్లెల్లో మట్టి దందా అనే శీర్షిక వార్త దినపత్రికలో ప్రచురితం కావడం తో స్పందించిన ఏడి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల నుండి తీసిన మట్టి అక్కడే పోశారని, ఇతర ప్రాంతాలకు మట్టి తరలిపోలేదని అన్నారు. అనుమతులు ఉంటేనే మట్టి తవ్వకాలు చేపట్టాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సర్పంచ్ మల్లేశం, ఆర్ ఐ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

**వేములవాడ వార్త**

# బీరప్ప-కమరావతి కళ్యాణ మహోత్సవం సోమవారం జరగనుంది

గంగ బోనం ఎత్తుకున్న అన్నవేణి రవి-శ్రీనివాస్

వేములవాడ రూరల్ ప్రభాతవార్త:



వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామంలో జరుగుతున్న శ్రీ బీరప్పస్వామి-కమరావతి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గంగ బోనం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన అన్నవేణి రవి-శ్రీనివాస్ భక్తి పారవశ్యంతో గంగ బోనం ఎత్తుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల జైజై కారాలతో గ్రామ వీధులన్నీ ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయాయి. సంప్రదాయ వస్త్రధారణలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని బీరప్పస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. గంగ బోనం ఊరేగింపు సందర్భంగా మహిళలు బోనాలతో పాల్గొనగా, యువకులు వీరగంధాలతో ప్రత్యేక నృత్యాలు చేశారు.ఈ సందర్భంగా అన్నవేణి రవి-శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి సంవత్సరం జరిగే బీరప్పస్వామి మహోత్సవాలు భక్తుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సుంకు కార్యక్రమము, సుగ్గు వేయుట, గంగ బోనాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే సోమవారం జరగనున్న బీరప్ప-కమరావతి కళ్యాణ మహోత్సవానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమాలు అధ్యక్షుడు ఎం. కొమురయ్య, ఉపాధ్యక్షుడు జి. పరుశరాం, ప్రధాన కార్యదర్శి సూర మల్లేశం, కార్యవర్గ సభ్యులు మరియు కురుమ యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి.

# ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

–పట్టించుకోని అధికారులు.. భయాందోళనలో రైతులు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చేతికి అందే ఎత్తులో విద్యుత్ హై టెన్షన్ వైర్లు వేలాడుతుండడంతో రైతులు గురవుతున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో కర్నాల గణేష్ వ్యవసాయ భూమిలో హై టెన్షన్ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండగా, వ్యవసాయ పనులు చేసే సమయంలో తగులుతాయేమోనని భయం భయంగా పనులు చేసుకునే పరిస్థితి నెలకొంది. విద్యుత్ లూజ్ వైర్ల మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ఇలాంటి చర్యలు తీసుకుంటారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. లూజ్ వైర్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాద నివారించాలని రైతు కోరుతున్నాడు.

# నాణ్యతతో బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి బైపాస్ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో

పరిశీలించిన కలెక్టర్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దకల్వల నుండి అప్పన్నపేట వరకు 12 కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలయ్యాయని, వాటితో పాటు ప్రస్తుతం మట్టి పోసే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని, పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా



పనులు నిర్వహిస్తున్న కార్మికులకు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికులకు తాగునీరు, విశ్రాంతి వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో ఈ ఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు పేరుతో కార్మికులకు మోసం?

గుర్తింపు సంఘాలపై టిబీజీకేఎస్ తీవ్ర ఆరోపణలు

గోదావరిఖని, ప్రభాతవార్త:



సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం పేరుతో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు అసత్య ప్రచారాలు చేస్తూ కార్మికులను మభ్యపెడుతున్నాయని టిబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంత్రులు, సీ అండ్ ఎండీ, ఉన్నతాధికారులను కలిసినట్లు పాత ఫొటోలు విడుదల చేస్తూ "త్వరలో సమస్యలు పరిష్కారం అవుతాయి" అంటూ కార్మికుల్లో తప్పుడు ఆశలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 23న జరగనున్న మెడికల్ బోర్డు విషయంలో గుర్తింపు సంఘాలు "మేమే సాధించాం" అంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. ఇది రెగ్యులర్ మెడికల్ బోర్డు కాదని, గత మూడున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేవలం 32 మంది కార్మికులకు సంబంధించిన ప్రత్యేక బోర్డు మాత్రమేనని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల క్రితమే దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ పరిగణనలోకి తీసుకుని పూర్తి స్థాయి రెగ్యులర్ మెడికల్ బోర్డు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారని తెలిపారు. కొత్త బావుల పేరుతో ప్రభుత్వం, గుర్తింపు సంఘాలు చేస్తున్న ప్రచారం కూడా వాస్తవాలకు విరుద్ధమని రాజిరెడ్డి పేర్కొన్నారు. కొత్త గనుల పేరుతో ప్రచారం చేస్తున్నవి వాస్తవానికి పాత మైన్ల ఎక్స్‌టెన్షన్ అనుమతులేనని, కొన్ని ప్రాజెక్టులకు గతంలోనే అనుమతులు వచ్చిన విషయాన్ని దాచిపెడుతున్నారని విమర్శించారు. కార్మికులు, నిరుద్యోగ యువత ఈ ప్రచారాలను గమనించాలని సూచించారు. మారుపేర్ల సమస్యను కూడా అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. "లీగల్ ఒపీనియన్" పేరుతో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత లేని డిపెండెంట్లపై విజిలెన్స్ పేరుతో వేధింపులకు దారితీసే సర్క్యులర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పత్రికా సమావేశంలో టిబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, అయిలి శ్రీనివాస్, జావేద్ పాషా, చెల్పూరి సతీష్, చల్లా రవీందర్ రెడ్డి, బేతి చంద్రయ్య, అబ్దుల్ గని, దూట శేషగిరి, జనగామ మల్లేష్, అడ్డగట్ల గోపి, పుల్వాక శంకర్, రామ్ రెడ్డి, నూతి రాజ్‌కుమార్, మహేష్, కొప్పుల శ్రీనివాస్, కళాధర్ రెడ్డి, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బ్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడికి వినతి

రామగిరి ప్రభాతవార్త



మంథని జేఎన్టీయూ కాలేజీలో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కి శనివారం వినతిపత్రం అందజేశారు. తమకు రావలసిన వీ డి ఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కాలేజీలో మ్యాన్ పవర్ తక్కువగా ఉండటంతో విధుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే ఖాళీ పోస్టులను పూర్తిగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కార్మికుడు డ్యూటీకి రాలేకపోతే మ్యూచువల్ డ్యూటీ అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయు నాయకులు వెంకన్నతో పాటు జేఎన్టీయూ సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.

# ధూప దీప నైవేద్య పథకంలోని దేవాలయాల్లో సోషల్ ఆడిటింగ్

రామగిరి ప్రభాతవార్త



రామగిరి మండలంలోని డి డి ఎన్ దేవాలయాల్లో శనివారం సోషల్ ఆడిటింగ్ నిర్వహించారు ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి ప్రత్యేక అధికారి పి. రాజబాబు దేవాలయాల గురించి అడిగి తెలుసుకున్నారు ఇందులో భాగంగా బేగంపేట గ్రామంలోని భక్త మార్కండేయ దేవాలయం రామేశ్వరాలయం రామగిరి ఖిల్లా సీతారామ ఆంజనేయ స్వామి దేవాలయాలని సందర్శించారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ మంతెన చంటి మరియు ఆలయాలు కమిటీ మెంబర్స్ శివచంద్ర శర్మ, సంతోష్ శర్మ భాస్కరాచార్యులు, సత్యనారాయణ చార్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంథని వార్త



## పంట మార్పిడి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది

-ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె. అనూష

-అడవి శ్రీరాంపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ముత్తారం, ప్రభాతవార్త:



పంట మార్పిడి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె. అనూష తెలిపారు. శనివారం ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె. అనూష మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పోలాస, జగిత్యాల నుండి కీటక విభాగ శాస్త్రవేత్త ఎస్. రమేష్ హాజరై వరిలో మేలైన రకాల గురించి రైతులకు వివరించారు. రైతులు పంటలలో ఎరువుల యొక్క అధిక వాడకం వలన కలిగే నష్టాలను, ఎరువులు శాస్త్రీయంగా వాడే విధానాన్ని రైతులకు కూలంకషంగా వివరించారు. అదేవిధంగా మొక్కజొన్న, వరి, ఆయిల్ పామ్ పంటలలో ఆశించే వివిధ రకాల చీడపీడల గురించి, వాటి యొక్క సమర్థవంతమైన నివారణ చర్యల గురించి రైతులకు శాస్త్రవేత్తలు వివరించారు. భూసారాన్ని రక్షించుకోవడానికి సేంద్రీయ ఎరువులు వాడే విధానాన్ని రైతులకు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారీ ఎస్. శ్రీలేఖ, సర్పంచ్ బి. అన్నపూర్ణ, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండలంలో అందుబాటులో 830 బస్తాల జిలుగా విత్తనాలు

-ముత్తారం మండల వ్యవసాయ అధికారి జే.అనూష

-50 శాతం సబ్సిడీతో రైతులకు జిలుగా విత్తనాల పంపిణీ

ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండలంలో 830 బస్తాల జిలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ముత్తారం మండల వ్యవసాయ అధికారి జే.అనూష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిలుగా విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు ప్రకటించారు. జిలుగా విత్తనాలు కావలసిన రైతులు వారి యొక్క పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముత్తారం కేంద్రానికి గానీ లేదా ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం మైదంబండకు గానీ వెళ్లి విత్తనాలను పొందాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఈ విత్తనాలపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, దీనిని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 కేజీల బస్తా రైతు ధర 2452 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, రైతులు ఎలాంటి గందరగోళానికి గురికాకుండా అవసరమైన పత్రాలతో నిర్ణీత కేంద్రాలలో సంప్రదించి సబ్సిడీ విత్తనాలను సకాలంలో తీసుకెళ్లాలని సూచించారు.

# జగిత్యాల డీఎస్పీ, పురుషోత్తం రెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్, జిల్లా కమిటీ నాయకులు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా డి.ఎస్.పి పురుషోత్తం రెడ్డి ని శనివారం ఎమ్మార్పీఎస్, జగిత్యాల జిల్లా కమిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సందర్భంగా డిఎస్పీ, మాట్లాడుతూ దళితులకు సంబంధించిన పలు సమస్యలు నా దృష్టి కి వస్తే సామరస్యంగా పరిష్కరిస్తానని డిఎస్పీ, అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు దుమాల గంగారం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెట్టు పెల్లి లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్, బొల్లె అనిల్, కార్యదర్శి సంగేపు ముత్తు, మారంపల్లి శంకర్, సోషల్ మీడియా ఇన్చార్జి నక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్య లేదు

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్

బుగ్గారం ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్య లేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ అన్నారు. శనివారం చిన్నాపూర్ గ్రామం వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్ మాట్లాడుతూ దాదాపు 90 శాతం ధాన్యం కొనుగోలు అయి మిల్లర్లకు తరలించడం జరిగిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం కోసమే పనిచేస్తుంది, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని బుగ్గారం మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో దాదాపు 90శాతం దాన్యం కొనుగోలు జరిగి మిల్లర్లకు తరలించడం జరిగిందని స్పష్టం చేశారు. గత పది ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల గొంతు కోయడానికి వరి ధాన్యం తప్పా, తాలు కట్టింగ్ ఆనవాయితీగా



తీసుకువచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో అప్పటి మంత్రీ కొప్పుల ఈశ్వర్ స్థానిక నాయకులు ఎప్పుడైనా కొనుగోలు కేంద్రాలను సందర్శించిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు,ప్రతి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శిస్తూ ఎప్పటికప్పుడు అధికారులను ఆదేశిస్తూ ధాన్యం తరలించాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దని సూచిస్తున్నారని అన్నారు.

## ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత

ధర్మపురి,ప్రభాతవార్త:

మరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని, వరి కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలంలోని జైన,దొంతాపూర్, ఆరేపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



అలాగే టక్ షేక్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు తదితర డాక్యుమెంటేషన్ పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమశాతం, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

ధర్మపురి,ప్రభాతవార్త:



ధర్మపురి పట్టణంలోని ఓ వృద్ధురాలు మెడలో నుండి బంగారు గొలుసు దొంగిలించిన కేసులో తిప్పని అంజన్న అనే నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు.ఇందుకు సంబంధించి పోలీస్ స్టేషన్ కార్యాలయంలో నిందితుడిని ప్రవేశపెడుతూ చోరీ సంఘటన వివరాలను ఎస్సై మహేష్ వివరించారు. గత నెల 2 న ధర్మపురి పట్టణంలోని కోనేరు సమీపన నడుచుకుంటూ వెళ్తున్న మాదాసు గుండమా అనే వృద్ధురాలు మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును మంచిర్యాల జిల్లా,నస్పూర్ కాలనీకి చెందిన తిప్పని అంజన్న లాక్కెళ్ళాడు. వృద్ధాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. అదే సమయంలో నిందితుడు ఫోటోలు సీసీ కెమెరాలు రికార్డ్ అవడంతో వాటిని సేకరించినట్లు తెలిపారు. శనివారం ఉదయం దేవాలయం సమీపంలో నిందితుడైన అంజన్న సంచరిస్తుండగా స్థానికులైన వేముల సంతోష్, అప్పం రాజన్న,చీరల నరసవ్వ లు అతడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగిలించిన్న రెండు తులాల పుస్తెలతాడు తో పాటు తను ఉపయోగిస్తున్న సెల్ ఫోన్ ను స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. అలాగే సమాచారం ఇచ్చిన వ్యక్తులను పోలీసు అధికారులు అభినందించారు.

## ప్రేమ్ సాగర్ రెడ్డి మాతృమూర్తి అంత్యక్రియలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి మాతృమూర్తి మూల సరోజన అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతూ శనివారం మరణించడంతో వారి స్వగ్రామం అయిన మండలంలోని కోమిర గ్రామానికి వెళ్లి వారి ప్రార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం వారి అంత్యక్రియలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి సంతాపన్ని తెలిపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు వీరి వెంట జిల్లా నాయకులు, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు,సింగిల్ విండో చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు మండల పార్టీ కాంగ్రెస్ శ్రేణులు వివిధ పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వారికి నివాళులు అర్పించారు.

## అగ్నికి ఆహుతి..

### -తాటి, ఈత వనాలు దగ్ధం -ఉపాధి కోల్పోయిన గౌడ కులస్థులు

### కొలనూర్‌లో ఘటన

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



మండలం కొలనూరు గ్రామంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ శివారులో గౌడ సంఘానికి చెందిన ఈత, తాటివనం అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుంది. క్షణాల వ్యవధిలోనే మంటలు వనమంతటా వ్యాపించడంతో తాటి, ఈత చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం స్థానిక గౌడ కులస్తులను కోలుకోలేని దెబ్బతీసింది. సుమారు 60 కుటుంబాలు ఈ వనంపైనే ఆధారపడి కల్లు గీస్తూ, తమ జీవనాన్ని సాగిస్తున్నాయి. చేతికొచ్చిన వనం కళ్ల ముందే బూడిదైపోవడంతో గీత కార్మికులు కన్నీటిపర్వంతమమువుతున్నారు. మా పొట్ట కొట్టిన ఈ ప్రమాదం మమ్మల్ని రోడ్డున పడేసింది అంటూ బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సర్వస్వం కోల్పోయిన తమ కుటుంబాలను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని గౌడ సంఘం నాయకులు, బాధితులు, సర్పంచ్ జలగం అరవిందరావు కోరుతున్నారు.

## ధర్మపురి వార్త

## వరి కొయ్యలు కాల్చివేత.. తప్పిన పెను ప్రమాదం

గొల్లపల్లి, ప్రభాతవార్త:



మండల కేంద్రం లోని మల్లన్నపేట-రాపల్లి రోడ్డుకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో వరి కొయ్యలను కాల్చివేయడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించే పరిస్థితి ఏర్పడింది. ఒక రైతు పొలంలో వెలిగించిన మంటలు గాలివేగంతో పక్కనే ఉన్న ఇతర పొలాలకు వ్యాపించడంతో స్థానిక రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.మంటలు వేగంగా వ్యాపిస్తూ పొలాల్లోని ఎండిన గడ్డి, వరి అవశేషాలను అంటుకోవడంతో పరిస్థితి అదుపు తప్పేలా మారింది. వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు గ్రామ సర్పంచ్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సర్పంచ్ ఘటన స్థలానికి చేరుకుని గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని తెప్పించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా ఫైర్ ఇంజన్ అక్కడికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బంది, రైతుల సహకారంతో మంటలు మరింత వ్యాపించకుండా నియంత్రించారు.ఈ ఘటనలో పక్కనే ఉన్న కొన్ని ఈత చెట్లు దగ్ధమయ్యాయి. అయితే సమయానికి చర్యలు తీసుకోవడంతో సమీపంలోని ఇతర పంట పొలాలకు మంటలు వ్యాపించకుండా పెద్ద ప్రమాదం తప్పింది.వ్యవసాయ అవశేషాలను కాల్చివేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

## ఐకెపి సెంటర్లలో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

పెగడపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని రాజారాం పల్లి గ్రామంలోని ఐకెపి సెంటర్ లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బి ఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకెపి సెంటర్ లో ఉన్న వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించే బాధ్యత ప్రజా ప్రతినిధులు అధికారులు తీసుకోవాలని, కటింగ్ లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు సాయిని రవీందర్,మండల మాజీ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నాగుల.రాజశేఖర్ గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షుడు బండారి కనకయ్య, సింగిరెడ్డి మల్లారెడ్డి, రాజు నాయక్, శేఖర్ నాయక్,మల్లేశం, తిరుపతి, ప్రభాకర్, కనుకయ్య,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడపల్లి వద్ద అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

### వ్యక్తికి తీవ్ర గాయాలు

చందుర్తి / ప్రభాతవార్త:

చ్తందుర్తి మండలం మూడపల్లి సమీపంలోని పోచమ్మ గుడి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. అశిరెడ్డిపల్లి నుండి వేములవాడ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి, మూడపల్లి మలుపు వద్ద వాహనంపై నియంత్రణ కోల్పోయారు. దీంతో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆవునూరు గ్రామానికి చెందిన పర్శరాములు ద్విచక్ర వాహనదారుడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వెంకటరమణారెడ్డి, తోట నరేందర్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మత్తు పదార్థాల వినియోగంతో యువత ఆలోచనా శక్తి నశించి భవిష్యత్తు చీకటిమయం

- జిల్లాలో డ్రగ్స్ రవాణా సాగు, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి
- అధికారులకు దిశానిర్దేశం

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



మత్తు పదార్థాల వినియోగంతో యువత ఆలోచనా శక్తి నశించి వారి బంగారు భవిష్యత్తు పూర్తిగా చీకటిమయంగా మారుతోందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా చేపట్టాల్సిన వివిధ రకాల పటిష్ట చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సమాజంలో యువత భవిష్యత్తు పూర్తిగా దెబ్బతింటుందని, వారి ఆరోగ్యంతో పాటు ఆలోచనా శక్తి కూడా నశిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాలు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి మంచి, చెడుల పై క్షేత్రస్థాయిలో సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారియోంలపై ఉందన్నారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థుల ప్రవర్తనను, వారి అలవాట్లను నిరంతరం పర్యవేక్షి ంచాలని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల సరఫరా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై ప్రజల్లో చైతన్యం పెంచడంతో పాటు, వాటి నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్, విద్య, వైద్య, రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో డీసీపీ రామ్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఏసీపీలు కృష్ణ, రమేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు కుమారస్వామి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయండి

- మంజూరైన పనులు పెండింగ్ లో ఉండద్దు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించండి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:



జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అధికారులు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు, ఐకెపి వీవో భవనాల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, తాగునీటి సమస్యల నివారణ చర్యలు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఐకెపి ఏపీఎంలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఏఈలు, డీఈలు, ఈఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పనులకు సంబంధించిన కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. అధికారులకు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో పాఠశాలల్లో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణం, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇంకా పనులు ప్రారంభం కాని ప్రాంతాల్లో వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఐకెపి వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జూన్ 2 తర్వాత ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి పెట్టనున్న నేపథ్యంలో జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అన్ని రకాల పెన్షన్లకు సంబంధించి కేవైసీ అప్‌డేట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పని చేయాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇతర అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇంచార్జి జెడ్పి సీఈవో పవన్ కుమార్, డిఆర్డిఓ గీత, డిపిఓ జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూముల మార్కెట్ విలువల సవరణను సమగ్రంగా చేపట్టాలి

## రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;



భూముల మార్కెట్ విలువల సవరణను సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి భూముల మార్కెట్ విలువల సవరణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హన్మంతు తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు...జగిత్యాల కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత తో కలిసిపాల్గొన్నారు..ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూజిల్లాల వారీగా భూముల మార్కెట్ విలువల అమలు పరిస్థితులను సమీక్షి స్తూ చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను పూర్తి చేసి సోమవారం రోజున సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఫైనల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లా డుతూభూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను ఖచ్చితమైన సమాచారం తయారు చేసి, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారుఈ కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో మరియు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

## -కాపల లేక పశువుల పాలవుతున్న వరి ధాన్యం

బీర్‌పూర్ ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగూరు గ్రామంలోని వడ్ల సెంటర్లలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న దయనీయ స్థితి అగమ్య గోచరంగా కనిపిస్తుంది. రెక్కలు ముక్కలు చేసుకొని, అహోరాత్రులు శ్రమించి పండించిన పంట కళ్ల ముందే ఎండకు ఎండిపోతుంటే, మరోవైపు పశువుల పాలవుతుంటే ఆ రైతన్నల గుండెలు తల్లడిల్లుతున్నాయి. ఎండనక, వాననక కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనీ ఎరుగాలం కష్టపడి పండించిన పంట పశువుల పాలు అవుతుందని రోజు రోజుకి బరువు దిగి పోతుందని రైతులు తమ దీనస్థితిని వెలిబుచ్చుతున్నారు.

### నిప్పుల కుంపటిలా వడ్ల కల్లాలు.. ఉడికిపోతున్న రైతాంగం!

ప్రస్తుతం ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నట్లుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతల్లో సరైన సదుపయాలుకూడా లేని వడ్ల సెంటర్లలో రైతులు రాత్రి పగలు తేడా లేకుండా ధాన్యం కుప్పల వద్దే కాపలా ఉంటున్నారు. ఎండ తీవ్రతకు అల్లాడిపోతూ, రాత్రి వేళలో ధాన్యం పశువుల కు ఆహారంగా మారకుండా కాపల కాయలేక నరకయాతన అనుభవిస్తున్నామని తెలుపుతున్నారు. ఇంత నరకం చూస్తున్నా.. కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యం రైతుల ఓపికను పరీక్షి స్తోంది.

### ఎండ వేడికి తగ్గుతున్న బరువు.. రైతుకు తీరని నష్టం!

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి రోజులు గడుస్తున్నా తూకం వేయడంలో ఆలస్యం జరగడంతో, భానుడి భగభగలకు ధాన్యంలోని తేమ శాతం పూర్తిగా ఆరిపోతోంది. దీనివల్ల వరి ధాన్యం బరువు గణనీయంగా తగ్గిపోతోంది. క్వింటాకు రెండు నుండి మూడు కిలోల వరకు బరువు కోల్పోవాల్సి వస్తోందని, దీనివల్ల తమ శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గిట్టుబాటు ధర దేవుడెరుగు.. ఉన్న బరువు కూడా తగ్గిపోయి అదనపు నష్టం మూటగట్టుకోవాల్సి వస్తోందని కన్నీరుమున్నీరవుతున్నారు.

### వడ్ల కల్లాలలో కాపల లేక పశువులకు ఆహారంగా మారుతున్న ధాన్యం

ఒకవైపు ఎండల దెబ్బ.. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద పంట రక్షణకు ఎలాంటి కనీస ఏర్పాట్లు లేకపోవడంతో, కుప్పలుగా పోసిన వరి ధాన్యాన్ని పశువులు యథేచ్ఛగా మేసేస్తున్నాయి. కాపలా కాయలేక, అటు పట్టించుకునే నాథుడు లేక రైతులు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను పంచుకుంటున్నారు. ఇది ఒక్క తుంగూరు గ్రామ సమస్య మాత్రమే కాదు.. బీర్పూర్ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని వడ్ల కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే ఘోర పరిస్థితి నెలకొందనీ అక్కడి పరిస్థితులను పరిశీలిస్తే తెలిసే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

### లారీలు తెప్పించి.. తక్షణమే తూకం వేయాలి!

ఎండనక వాననక ఇక్కడే పడి ఉంటున్నాం. ఎండ దెబ్బకు వడ్లు ఆరిపోయి తూకంలో బరువు తగ్గిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి" అని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆకాశ భగ బగలతో ఎండ వేడిమికి తట్టుకోలేని పరిస్థితి ఒకవైపు.. పశువుల నోట్ల పడుతున్న ధాన్యం మరోవైపు.. ఎండకు తగ్గుతున్న బరువు ఇంకోవైపు.. ఇలాంటి త్రిశంకు స్వర్గంలో ఉన్న అన్నదాతలను ఆదుకోవడానికి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి, తగినన్ని లారీలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, వడ్ల సెంటర్ల వద్ద పశువులకు కాపలాగా కాపలా దారులను ఏర్పాటు చేయాలని తుంగూరు గ్రామ రైతులు మరియు మండలం వ్యాప్తంగా ఉన్న రైతాంగం చేతులు జోడించి వేడుకుంటోంది.

# బస్టాండ్‌లో మహిళ బ్యాగ్ దొంగతనం

## ఆరు గంటల్లోనే నిందితుడి అరెస్టు చేసిన జగిత్యాల టౌన్ పోలీసులు

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త** జగిత్యాల జిల్లాలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల దొంగతనం కేసును జగిత్యాల టౌన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఫిర్యాదు అందిన ఆరు గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గోపులాపూర్ గ్రామం, బుగ్గారం మండలానికి చెందిన జరినా బేగం, తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు శనివారం ఉదయం జగిత్యాల న్యూ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతుండగా, ఆమె వద్ద ఉన్న సుమారు 22 గ్రాముల బంగారు ఆభరణాలు కలిగిన హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితురాలు వెంటనే జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ ఆదేశాల మేరకు, ఎస్.ఐ ఎం.సుప్రియ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు జీవన్ చంద్రశేఖర్‌లతో కూడిన ప్రత్యేక బృందం నిందితుడి కోసం గాలింపు చర్యలు



చేపట్టింది. నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు, రాయికల్ మండలం, అల్లిపూర్ గ్రామానికి చెందిన అరికెళ్ల అంజయ్య 59 ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో అతడిని అరెస్టు చేశారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించి, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు జీవన్, చంద్రశేఖర్‌లను జగిత్యాల డి.ఎస్.పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ సీఐ పి. కరుణాకర్ అభినందించారు.

## ఊరి కోసం ఒక్క రోజు" శ్రమదానం:

### స్వచ్ఛ కమలాపూర్‌కు సర్పంచ్ పిలుపు..

### పెద్ద గ్రామం, చిన్న సైన్యం :

### శ్రమదానమే ఆయుధం..

### సర్పంచ్ పబ్బు సతీష్...

కమలాపూర్: ప్రభాతవార్త.కమలాపూర్:

"ఊరు బాగు కోరుకునే ప్రతి ఒక్కరూ కదిలిరావాలి. మన ఊరి కోసం మీ విలువైన సమయం నుంచి కేవలం ఒక్క రోజు కేటాయించండి" అని కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఖిస్వచ్ఛ కమలాపూర్ఖి లక్ష్యంగా గ్రామ పారిశుధ్య పరిరక్షణకు "ఊరి కోసం ఒక్క రోజు" పేరుతో శనివారం భారీ శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పబ్బు సతీష్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సీఏలు, వీవోఏ అధ్యక్షులు, పారిశుధ్య సిబ్బంది, గ్రామ యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేశారు. ప్రత్యేకంగా ఈ శ్రమదానం కోసం నేటిదాత్రి గ్రూప్స్ చైర్మన్ కట్ట రాఘవేందర్ రావు, సీఈఓ కట్ట శివ సుబ్రమణ్యం స్వగ్రామానికి వచ్చి శ్రమదానంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ, "కమలాపూర్ పెద్ద గ్రామం కావడం, పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం సవాలుగా మారింది. అందుకే గ్రామస్తులను పారిశుద్ధ్యంలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈ ఖిఊరి కోసం ఒక్కరోజుఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, మొక్కల సంరక్షణే ఈ శ్రమదానం ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు."గ్రామాభివృద్ధిని కాంక్షించే ప్రతి యువతీ యువకుడు, గ్రామ పెద్దలు వారంలో ఒక్క రోజు మన ఊరి కోసం శ్రమిద్దాం. అందరం కలిసికట్టుగా కదిలితే మన కమలాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవడం కష్టమేమీ కాదు. రండి, మాతో చేతులు కలపండి" అని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, శిశు మందిర్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## జమ్మికుంట కూరగాయల మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట కూరగాయల మార్కెట్ సముదాయాన్ని ప్రజలకు,చీవ్యాపారులకు వినియోగంలోకి తీసుకురావాలనీ జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు. జమ్మికుంట పట్టణం పరిసర ప్రాంతాలలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ఉండటంతో ప్రజలు, రైతులు, కూరగాయల వ్యాపారులు ఎన్నో కష్టాలు పడుతున్నారనీ తెలిపారు. ముఖ్యంగా రైతులు, రిటైల్ హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు నడిరోడ్డుపైనే ఎటువంటి సరైన సదుపాయాలు లేకుండా మండుటెండలో కూరగాయలు అమ్ముకోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజలు కూడా ఎండలో నిలబడి కూరగాయలు కొనడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూరగాయలు త్వరగా పాడవుతూ రైతులు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారనీ వారు తెలిపారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన జమ్మికుంట కూరగాయల సముదాయం ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలిపోవడం చాలా విచారకరమని అన్నారు. ఆ సముదాయంలో వ్యాపారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా షెడ్లు, టాయిలెట్స్, పెద్ద పెద్ద ఫ్యాన్లు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబడినాయనీ ఇంత మంచి సదుపాయాలు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం ప్రజలకు, వ్యాపారులకు నష్టదాయకంగా మారిందనీ తెలిపారు. పాలకవర్గ సభ్యులు ప్రజల ఆరోగ్యం, రైతుల సంక్షేమం, వ్యాపారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని జమ్మికుంట పట్టణం పరిసర ప్రాంతాలకు చెందిన అన్ని కూరగాయల వ్యాపారులు, రైతులు కూరగాయల సముదాయంలోనే తమ వ్యాపారాన్ని నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన ఈ కూరగాయల సముదాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే ప్రజలకు ఎండల నుంచి ఉపశమనం కలగడంతో పాటు రైతులు, వ్యాపారులు సురక్షిత వాతావరణంలో తమ వ్యాపారాన్ని కొనసాగించుకోగలుగుతారని వారు తెలిపారు. ఈ సమస్యపై తక్షణమే పాలకవర్గం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జమ్మికుంట ప్రజల పక్షాన కోరుతున్నామని వారు తెలిపారు.



## అనుమతి లేని సీసీ కెమెరాల తొలగింపు.....

### 28వ వార్డు ప్రజల ఫిర్యాదుకు స్పందించిన కౌన్సిలర్ ఒగ్గు రమేష్..

.జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో ప్రైవేటు వ్యక్తులు రోడ్లకు ఇరువైపులా దాదాపు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కెమెరాల ద్వారా వార్డులోని ప్రజల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని, ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని వార్డు ప్రజలు కౌన్సిలర్ ఒగ్గు రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కౌన్సిలర్ ఒగ్గు రమేష్, వార్డు సభ్యుల కోరిక మేరకు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆ ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఒగ్గు రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు, నేరాల నివారణకు ఉపయోగపడే విధంగా ఉండాలని, అయితే ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధంగా వాటిని వినియోగించడం సరైన పద్ధతి కాదన్నారు. నగరపంచాయతీ పోలీసు శాఖల అనుమతులు లేకుండా రోడ్లపై కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి నియంత్రణను వ్యక్తిగత ఇంట్లో ఉంచుకోవడంపై వార్డు ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రజల హక్కులు, గోప్యతను పరిరక్షించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం, భద్రత, గోప్యతకు ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీ చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు కౌన్సిలర్ తక్షణ స్పందనపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కమలాపూర్‌లో బడిబాట పై సమీక్ష.

కమలాపూర్; ప్రభాత వార్త.

కమలాపూర్: 202627 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే లక్ష్యంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఖిబడిబాటఖి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామస్థాయిలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాబు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోవు. అన్ని వసతులతో



నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్నాం. ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు కాస్మోటిక్ ఛార్జీలు కూడా ఇస్తున్న విషయాన్ని ప్రతి తల్లిదండ్రులకు తెలియజేయాలి" అని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ, "మన మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో రాష్ట్రంలోనే ముందున్నాయి. గతేడాది పదవ తరగతి పరీక్షల్లో కమలాపూర్ మండలం జిల్లాలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించింది. పలువురు విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలో టాప్ మార్కులు సాధించారు. ఈ విజయాలను తల్లిదండ్రులకు వివరించి వారిలో భరోసా కల్పించాలి. డిజిటల్ తరగతులు, లైబ్రరీ, ఆటస్థలం వంటి అన్ని సౌకర్యాలు మన బడుల్లో ఉన్నాయని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి" అని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామస్థాయిలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈ సందర్భంగా కోరారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ శ్రీను, జి సి డి ఓ, సునీత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ధర్మరాజుపల్లిలో యువతకు చైతన్యం...

### -- జూన్ 25 నుంచి ఊరూరా జెండా ఆవిష్కరణలు

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

హుజురాబాద్ మండల పరిధిలోని ధర్మరాజుపల్లి గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మాదిగ యువతను నాయకులు కలిసి, వారిలో సామాజిక చైతన్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు, ఏంఎస్పీ జిల్లా అధ్యక్షులు తునికి వసంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుండి జూలై 5వ తేదీ వరకు పల్లె పల్లెకు తరలండి కార్యక్రమం విస్తృతంగా సాగుతుంది. ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండుగలా నిర్వహించాలని అన్నారు. దళిత యువత, నాయకులు పెద్ద సంఖ్యలో కదలివచ్చి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రతి పల్లెలోనూ ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలని, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మన ఐక్యతను చాటాలని మంద రాజు, తునికి వసంత్ పేర్కొన్నారు. ఈ సన్నాహక సమావేశంలో మారముల స్పందన, మంద యుగేందర్ తో పాటు స్థానిక యువకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈనెల 29న షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం యూనిట్లకు ఇంటర్వ్యూలు.....

### మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం 202526 కార్యాచరణ ప్రణాళిక ప్రకారం వివిధ రకాల యూనిట్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29న ఉదయం 11 గంటలకు జమ్మికుంట పురపాలక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒక సెట్ తో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## తక్కువ యూరియాను వాడండి...

### రసాయనాల వినియోగాన్ని తగ్గించండి....శాస్త్రవేత్త భాస్కర్.

వీణవంక,ప్రభాత వార్త:

రైతులు తక్కువ యూరియాను వాడండి,అవసరమేరకు రసాయనాలను వాడండ నీ శాస్త్ర వేత్త భాస్కర్ అన్నారు.బుధవారం వీణవంక మండలములోని చల్లూరు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్ర వేత్త మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ విజ్ఞానా న్నీ నేరుగా క్షేత్ర స్థాయిలో తీసుక పోవడం జరుగుతుందన్నారు.యూరియా ను తగ్గించి, రసాయన ఎరువులను తగ్గిస్తూ నెల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండ నీ అన్నారు. మార్కెట్ లో గిరాకి ఉన్న వరి వంగడాలను సాగుచేసి సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు.చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుతూ చెట్ల కొయ్యలను కాల్చద్దన్నారు.పచ్చి రొట్టె సాగుతో భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికా రీ గణేష్, గ్రామ సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డి,మాజీ విండో చైర్మన్ మల్లారెడ్డి తో పాటు రైతులు పాల్గొన్నారు.



# రైతులకు అవగాహన



కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో కోరుట్ల మండలంలోని పైడిమడుగు గ్రామ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించడం, మార్కెట్ లో ఎక్కువ అమ్మకానికి ఉన్న వరి రకాలు పండించడంపైన అవగాహన కల్పించారు. రైతులు జేజీఎల్1798, కె యన్ యం 1638, బి పి టి 5204, తెలంగాణ సోనా, హెచ్ యం టి, డబ్ల్యుజిల్ 962, డబ్లు జి యల్44 వంటి గిరాకీ ఉన్న వరి రకాలను పండించాలని తెలిపారు. వరిలో పంట అవశేషాలను తగులబెట్టకుండా కలియదున్నాలని సూచించారు. అభ్యుదయ రైతులు యం.జనార్దన్, ఎస్. నర్సా రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవరాల సాగు, కోతులు అడవివందులను నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఏఈ వో ఎ. రాఘవేంద్ర మాట్లాడుతూ పంట మార్పిడి పై అవగాహన కల్పించారు. సర్పంచ్ బి. భూమేష్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులలో కొంత భాగాన్ని పండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రముఖ ఫార్మా కంపెనీ కి ఎంపికైన విద్యార్థినులు

చొప్పదండి, ప్రభాతవార్త:




హైదరాబాద్ లోని ఎస్ కె ఎస్ ఫ్రీ ఫార్మా జాబ్ హబ్ లో హెటిరో కంపెనీ వారు నిర్వహించిన జాబ్ మేళాలో చొప్పదండి పట్టణంకి చెందిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ధరవేణి దీపిక, గుండేటి ఇందు ఎంపిక అయినట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్లు అనిల్ కుమార్ వెంగళ హరిప్రసాద్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కోరిన. మున్సిపల్ చైర్ పర్సన్.



ఆలేరు, మే 23 (ప్రభాతవార్త):

ఆలేరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ యాదగిరిగుట్ట పర్యటనలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చైర్‌పర్సన్ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. అలాగే ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చైర్‌పర్సన్ వెల్లడించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నల్లబెల్లి, మే 23, ప్రభాతవార్త



మండలంలోని ముచ్చింపుల తండా గ్రామానికి చెందిన మచ్చిక రాజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి స్థానిక సర్పంచ్ మచ్చిక రవి ఆధ్వర్యంలో విద్యా కమిటీ మాజీ చైర్మన్ భూక్య శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు 50 కేజీల బియ్యంతో పాటు 2000 రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. అనంతరం ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో విజ్‌డమ్ విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట, మే 23, ప్రభాతవార్త



పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్షల్లో విజ్‌డమ్ హైస్కూల్‌కు చెందిన షేక్ ఫర్మాన్‌షా రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకును సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ తెలిపారు. ఈ విద్యార్థి 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించినట్లు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఫర్మాన్‌షా మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్ కావడం తన లక్ష్యమని తెలిపారు. తన విజయానికి నిరంతరం కృషి చేసిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. షేక్ అర్మాన్ షా స్టేట్ 48వ ర్యాంకు, గౌతమ్ స్టేట్ 350 వ ర్యాంకు సాధించగా, 2000 ర్యాంకు లోపు 12 మంది విద్యార్థులు సాధించినట్లు డైరెక్టర్ జావేద్ తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావేద్, అకాడమిక్ అడ్వైజర్ నాజియ ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, హై స్కూల్ ఇన్చార్జి హారిక, వీరభద్రయ్య, రాము, ఇలియాస్, శివరాజ్, సతీష్ కుమార్, రఘుపతి రెడ్డి, బి రవీందర్, వెంకటేశ్వర్లు, నవీన్, ఎల్ రవీందర్ లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## 25న ఎస్ సి వర్గ ప్రజల సబ్సిడీ లబ్దిదారుల ఎంపిక

చొప్పదండి, ప్రభాతవార్త:

పురపాలక సంఘం చొప్పదండి ఎస్ సి సామాజిక వర్గ ప్రజల ఆర్థికాభివృద్ధి లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ లోన్లలో భాగంగా ఈ నెల 25న సోమవారం రోజున మధ్యాహ్నం 2గంటలకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. కావున దరఖాస్తు చేయకున్న వారు ఇట్టి ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూలకు కార్యాలయంలో సమర్పించిన సెట్ మరియు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కులం, ఆదాయం, డ్రైవింగ్ లైసెన్సు, బ్యాంకు మొదలగు ఒరిజినల్ సర్టిఫికెట్ల సెట్ తో హాజరుకాగలరని కమిషనర్ కోరారు.

## లంబాడి పల్లి లో యువకుడు ఆత్మహత్య

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలం లంబాడి పల్లి గ్రామంలో గంధం అఖిలేష్ ( 23) ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం మృతుని తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు చేసినట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు, కూలి పని నిమిత్తం ముంబాయి వెళ్లిన అఖిలేష్ వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడని , శనివారం ఉదయం 7 గంటలకు చూసేసరికి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు, గతంలో ఎవరో అమ్మాయిని ప్రేమించాడని వారి మధ్య ఏమన్నా మనస్పర్ధలు వచ్చి ఉంటాయని, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకో వచ్చునని మృతుని తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు,

## తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పరిశీలకుడిగా మణిపాల్ రెడ్డి



ఆలేరు, మే 23 ప్రభాతవార్త :

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పరిశీలకుడిగా, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కందడి మణిపాల్ రెడ్డిని నియమించినట్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మకు మణిపాల్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు చేరువ చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన మణిపాల్ రెడ్డి, ప్రజా సేవే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

## మృతుడి కుటుంబానికిఆర్థిక సహాయం



ఖానాపురం, మే 23, ప్రభావార్త

ధర్మరావుపేట గ్రామంలో కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన పిసరి రంజిత్ కుటుంబానికి గ్రామస్తులు నిలిచారు. గ్రామ ప్రజలు రూ.42 వేలు, గ్రామంలోని నేతాజీ యువజన సంఘం బాధ్యులు రూ. 20వేలు, పదవ తరగతి మిత్రులు రూ.20 వేలు మొత్తం 82 వేల రూపాయలను రంజిత్ కుమార్తె అయిన హయాంషీ పేరుమీద పోస్ట్ ఆఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన పథకంలో ఈ డబ్బులను డిపాజిట్ చేసి బాండ్ పేపర్లను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సంఘం బాధ్యులు కుస కుమారస్వామి, గాజె కుమారస్వామి, ఇంతల సోమన్న వార్డు సభ్యులు కొనుకటి మోహన్ గ్రామస్తులు వల్లే శ్రీనివాస్, ముదురు కుమారస్వామి, కోడిమాల సురేష్,ముదురు రాంబాబు,భానోత్ అనిల్,తండా రమేష్, విలేజ్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి తోట రవి, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు 29 పోస్టులు మంజూరు

గంగాధర,ప్రభాత వార్త :



మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తెలంగాణ ప్రభుత్వం భారీగా ఉద్యోగ పోస్టులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మొత్తం 29 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంజూరైన పోస్టుల రెగ్యులర్ టీచింగ్ పోస్టులు: 20 (అధ్యాపక పోస్టులు) నాన్‌టీచింగ్ పోస్టులు: 6 (కార్యాలయ సిబ్బంది) అవుట్‌సోర్సింగ్ పోస్టులు: 3 (సహాయక సిబ్బంది) గంగాధర పరిసర ప్రాంతాల గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులో నియోజకవర్గ విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ పోస్టులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వడదెబ్బకు రైతు మృతి.

మంగపేట మే23, ప్రభాతవార్త.

మండలంలోని రామచంద్రుని పేటకు చెందిన ఊటుకూరి సోమిరెడ్డి(78) అనే రైతు శుక్రవారం వడదెబ్బకు పూరెడుపల్లి ఊర చెరువులో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం కొంత మంది గ్రామస్తులు చెరువుకు వెళ్లగా చెరువులో పడుకుని ఉన్నట్లుగా ఉన్న వ్యక్తిని గమనించి అక్కడికి వెళ్లి చూడగా అతను మృతి చెందినట్లుగా గుర్తించినట్లు తెలిపారు.

## రైతులకు జీలుగా విత్తనాల పంపిణీ...

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



మండల పరిధిలోని నుస్తులాపూర్ ప్రాథమిక సహకార సంఘం, పోరండ్ల లో వచ్చిన జీలుగా విత్తనాలను చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి సింగిరెడ్డి స్వామీ రెడ్డి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్బంగా చైర్మన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనము భూ సారాన్ని పెంచి నాణ్యమైన దిగుబడి ఇస్తుందని చైర్మన్ తెలుపారు. ఈ కార్య క్రమం లో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ. శిరీష, భావన, అర్చన, శ్రావణి, సీ ఈ ఓ లు ఆంజనేయులు ,శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కవ్వంపల్లి

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

## లక్ష్మీపూర్ లో టీబి ముక్త భారత్ అభియాన్..

మానకొండూర్, ప్రభాతవార్త :



మండలం లక్ష్మీ ్మపూర్ గ్రామం లో వెల్ది పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మీ ్మపూర్ ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడనే లక్ష ్యంగా టీబీ ముక్తా భారత్ కార్యక్రమాన్ని తీసుకున్నారని దీని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామ ప్రజలకు క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన కల్పిస్తూ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి టీబీ నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చావనలాల్, వైద్య అధికారి డా. సాయిప్రసాద్, హెచ్ ఈ ఓ రుద్రమదేవి, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశం హాజీ బాబా, ఏఎన్ఎంలు సుమతి, స్వప్న, ఆశా కార్యకర్తలు అంజలి, ఎం. భాగ్యలక్ష్మి ్మ, ఎ. భాగ్యలక్ష్మి ్మ, కారోబార్ సుంక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్ ని మాజీ మంత్రి, కొప్పుల ఈశ్వర్ గ పరామర్శించారు.

ఇటీవల రాజేశం గౌడ్ కి మోకాలి మార్పిడి శస్త్రచికిత్ జరిగింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాజేశం గౌడ్ ప్రస్తుతం కోలుకుంటున్న తీరును అడిగి తెలుసుకున్న ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సుద్దల దేవయ్య గారు మాట్లాడుతూ..."రాజేశం గౌడ్ సీనియర్ నాయకులు. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కోరుకుంటున్నాను. వారు మళ్ళీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొని మనందరికీ మార్గనిర్దేశం చేయాలి," అని ఆకాంక్షి ంచారు.

## గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా చాలా కఠినమైన చర్యలు తప్పవు

**గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు**

**8 ఇంక్లైన్ కాలనీ, కేకే నగర్ పరిధిలోని రద్దీ ప్రాంతాలలో జాగిలాలతో విస్తృత తనిఖీలు**

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



గంజాయి విక్రయించినా లేదా సేవించినా చట్టరీత్యా చాలా కఠినమైన చర్యలు తప్పవని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల 8 ఇంక్లైన్ కాలనీ, సిర్కే చౌరస్తా, ఆటోస్టాండ్, టీస్టాళ్లు, పాన్ షాపులు, ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతం, కేకే నగర్‌తో పాటు ప్రజలు ఎక్కువగా రద్దీగా ఉండే విభిన్న ప్రాంతాల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్, నార్కోటిక్ బృందం సంయుక్తంగా శనివారం ప్రత్యేక జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీ కార్యక్రమాల సందర్భంగా సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ సమాజానికి పట్టిన మహమ్మారి లాంటి గంజాయి, ఇతర మత్తు పదార్థాలను యువతకు అలవాటు చేస్తూ విక్రయించినా, సేవించినా లేదా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి అక్రమంగా రవాణా చేసినా వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వల్ల ఎంతోమంది యువత తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ ప్రాంతాలలో మత్తు పదార్థాలకు సంబంధించిన ఎలాంటి అనుమానాస్పద సమాచారం తెలిసినా ప్రజలు భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ విస్తృత తనిఖీల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావుతో పాటు నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్, పెద్దపల్లి నార్కోటిక్ టీమ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## అనవసర అద్దాంతం చేయవద్దు

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**విద్యార్థులకు న్యాయం జరిగేలా కృషి**

**డి సిసి జిల్లా అధ్యక్షులు గజంగి నందయ్య**



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త

విద్యాలయం ఏర్పాటు లో అనవసర అద్దాంతం చేయవద్దని డిసిసి అధ్యక్షులుగా గాజంగి నందయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం మున్సిపల్ చైర్మన్ సమ్మెలో వారిని శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు బండ శంకర్ గిరి నాగభూషణం కొత్తమోహన్ మాజీ మున్సిపల్ చైర్మన్ అడ్వాల జ్యోతి లక్ష ్మణ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్బంగా వారు మాట్లాడుతూమీడియా సమావేశం లో మాట్లాడుతూ. కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో అనవసర రాద్దాంతం అవసరం లేదుసంజయ్ కుమార్ పలు చోట్ల పరిశీలించి స్థలాలు విద్యార్థులకు అనుకూలం. భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపల్ పూర్తిగా అవినీతిమయం.. ఖర్జూర మొక్కలు నాటితే ఈత పండ్లు కాస్తున్నాయి మీరా మాట్లాడేది.. హైదరాబాద్ లో బిజినెస్ చేసుకుంటూ మెరుపు తీగ లాగ జగిత్యాలకు వచ్చి ఏదో మాట్లాడితే ప్రజలు నమ్మరు ప్రజలు అన్ని గమనిస్తున్నారు.. ఎంపీ అరవింద్ పసుపు బోర్డు అని చెప్పి రైతులను మోసం చేశారు. స్పైస్ బోర్డు తో రైతులకు లాభం లేదుజగిత్యాల అభివృద్ధి కి ఎమ్మెల్య డా. సంజయ్ కుమార్ నిరంతర కృషి ప్రధాన కారణం. భోగ శ్రావణి మాట అదుపులో పెట్టుకొని మాట్లాడాలి అని లేకుంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుంది అని అన్నారు. భోగ శ్రావణి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు గా ఉంది. కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు లో జగిత్యాల నియోజకవర్గం అని పెట్టకుండా చల్గల్ అని పెట్టీ కావాలని విద్యార్థులను నాణ్యమైన చదువుకు దూరం చేసే ప్రయత్నం ఎంపీ అరవింద్ చేస్తున్నారు... స్థలం కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం కు ఉంటుంది. కాని చల్గల్ అని జీవో తేవడంలో రాజకీయ కోణం దాగుంది.. కేంద్రీయ విద్యాలయం లో 4 తరగతిలతో 240 మంది విద్యార్థులకు ఉపయోగం.. అందులో కేంద్ర రాష్ట్ర ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం... ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ లో దాదాపు 2500మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన మరియు వసతులువాలంతరు చాల విలువైన స్థలం కాబట్టే 2 ఎకరాలు కేటాయింపు... ఇతర చోట్ల అనువైన స్థలం కూడా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రతిపాదించారుజగిత్యాల అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తున్న నాయకులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ జగిత్యాల ప్రజలు అడిగే ప్రశ్నల నుండి పారిపోయి హైదరాబాద్ లో ఉన్న భోగ శ్రావణి మీరా మాట్లాడేది అన్నారుమీ కుటుంబం చరిత్ర అందరికీ తెలుసు అన్నారు అవసరమైతే మీకు మాట్లాడే భాషా పై, రాజకీయ అవగాహన పై ట్యూషన్ చెప్పిస్తాము జాగ్రత్త.. జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఆధ్వర్యం లో యావర్ రోడ్డు విస్తరణ అవుతుంది అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గట్టు సతీష్, శ్రీనివాస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## విజయవంతంగా ముగిసిన ఉద్యోగ సాధన మేళా

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 6వ రోజు "ఉద్యోగ సాధన మేళా" నిర్వహించడం జరిగింది. శనివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ సాధన మేళా"లో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉద్యోగ సాధనమేళా ఏర్పాటు చేసి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని టాస్క్, జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఈ ఉద్యోగ అవకాశాలను యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అనంతరం, యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచి పాల్గొన్న విద్యార్థులకు కలెక్టర్ ప్రత్యేక మెమెంటోలను అందజేసి అభినందించారు. అదేవిధంగా, ఈ మెగా జాబ్ మేళాలో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎ. సురేష్ , జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి ఎం. రాజశేఖర్ , జి.ఎం డి.ఐ.సి కీర్తికాంత్ , టాస్క్ , డీట్ అధికారి కౌసల్య , ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ , వైస్ ప్రిన్సిపాల్, ట్రైనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు, పీఈటీ కుమార్, పీఈటీ దుర్గాప్రసాద్, వివిధ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గాగిరెడ్డిపల్లి లో అగ్ని ప్రమాదం, భారీ నష్టం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామం లో శనివారం రోజున జరిగిన అగ్ని ప్రమాదం లో తీవ్ర నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఎండ వేడిమి దృష్ట్యా విద్యుత్ మిరుగులు పడటంతో ప్రమాదం సంభవించినట్లు, రైతులు పైపుల ద్వారా నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులు అన్నాడి రాజేశ్వర్ రెడ్డి 500 మీటర్ల పైపులైను, డ్రిప్పు పైపులు స్పిన్కర్ పైపులు, మంద ఎల్లయ్య 15 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. మంద పెద్ద ఎల్లయ్య పైప్ లైన్ తో పాటుగా బోరు పైపులు కూడా పూర్తిగా కాలిపోయినట్లు ప్రభాత వార్తకు తెలిపారు. జరిగిన అగ్ని ప్రమాదంపై సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేషం, వార్డు సభ్యులు మంద శ్రీనివాస్ లు కోరుతున్నారు.



# ఓటర్ల మ్యాపింగ్‌లో మహబూబాబాద్ జిల్లా మొదటిస్థానం

**-జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్**

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా 92.24 శాతం మ్యాపింగ్ చేసి మహబూబాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధృవపత్రాలు చూపాల్సి అవసరం లేదన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌వోలు, భారత ఎన్నికల చట్టం ప్రకారం ఓటరు జాబితా తయారు చేయడం జరుగుతుందని సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని ఓటరు జాబితా సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు, అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణకు ఆదేశించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలు తరుచుగా వలసలు వెళ్లడం వలన ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని మరణించిన ఓటర్ల పేర్లు తొలగించడం తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ మేరకు అర్హులైన పౌరుడు



ఓటరు జాబితా నుండి తప్పిపోకుండా అలాగే అనర్హుడు కూడా ఓటరు జాబితాలో చేర్చబడకూడదని లక్ష్యంతో ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణను ప్రకటించిందని అన్నారు. ఎస్ఐఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్‌నాయుడు, శ్యామ్‌లోయశర్మ, చక్రపాణి, పవన్ కుమార్, సూపరింటెండెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

## పొగాకు రహిత సమాజం కోసం కరపత్రం ఆవిష్కరణ

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త**



స్థానిక ఉమా శంకర్ గార్డెన్స్ లో పొగాకు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించే ఒక వ్యతిరేక కరపత్రాన్ని జిల్లా వైద్యాధికారి (డి ఎం ఎచ్ ఓ) డాక్టర్ సుజాత, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం. శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి మరియు ప్రముఖ పౌరాణిక వేద పండితులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ గారు కలిసి శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వేద పండితులు ..బుర్రా భాస్కర శర్మ.. మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల అనేక రోగాలు, అనర్థాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సమాజంలో ఇలాంటి మంచి అవగాహన కల్పించడానికి ముందుకు వచ్చిన సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రంను ఆయన అభినందించారు.అనంతరం ..డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ సుజాత.. మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన పొగాకు అనే పదార్థానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరపత్ర రచయిత తవుటు రాంచంద్రం, శ్రీదేవి, ఊటూరి అశోక్ బాబు, రమ మరియు పురాణ ప్రవచనాలు వినడానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదాం

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**





తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా జాతీయ హరితదళం మరియు తెలంగాణ పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డు వారు 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో బాగంగా పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధరూర్ కాలనీ లో కొనసాగుతున్న వేసవి శిబిరం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా విద్యార్థులకు పర్యావరణ విద్యపై అవగాహన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా హరితదళం కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్ రెడ్డి లు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుని బాధ్యత అని మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, నీరువిద్యుత్ పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చున్నారు. అలాగే ఒక్కో విద్యార్థి తమ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకే అప్పగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ పక్షాన ప్రశంసా పత్రాలు, బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు ఆనందరావు, ఉపాధ్యాయులు శ్రీదేవి,ప్రభాకర్, సమ్మర్ క్యాంప్ వాలంటీర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## ఆర్థిక చేయూత అందించాలి

**గార్ల,మే23,ప్రభాతవార్త:**



నందమూరి తారకరామారావు టీడీపీ పార్టీ స్థాపించిన నాటి నుండి వారి వీరాభిమానిగా ఉంటున్న మేడపల్లి దశరథ్ ప్రస్తుతం ఆర్థిక, అనారోగ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నాడని ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. తన 15సంవత్సరాల నుండి ఎన్‌టీఆర్ సినామాలకు ఆకర్షితులై క్షౌర వృత్తి చేసకుంటూనే ప్రతి సంవత్సరం రామారావు జన్మదిన వేడుకలను సొంత ఖర్చులతో జరిపేవాడని, పార్టీ ఆవిర్భావం సమయంలో నేరుగా హైద్రాబాద్ వెళ్లి ఎన్.టి. రామారావును కలసి ఆ రోజుల్లోనే సభ్యత్వం తీసుకొని పార్టీ అధికారంలోకి లేని సమయంలో కూడా పార్టీని వీడని నిజాయితీ పరుడన్నారు. నాడు గార్లలో పాదయాత్ర సమయంలో ఎన్.టి.ఆర్ వెంటే ఉన్నారని, ఎన్‌టిఆర్ మరణించిన సమయంలో గార్లలో స్వయంగా కర్మకాండలు నిర్వహించి అన్నదానం చేసి గుండు చేయించుకొని వీరాభిమానం చాటాడన్నారు. వయసు మీద పడడంతో ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని పార్టీ తరుపున ఆర్థికంగా ఆదుకోవాలని, టిడిపి పార్టీ చొరవ తీసుకొని పార్టీ తరుపున సంక్షేమ నిధి కేటాయించాలని కుటుంబ సభ్యులు, టిడిపి పార్టీనాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

## బయ్యారం సొసైటీలో జీలుగు విత్తన నిల్వల పరిశీలన

**-మండల వ్యవసాయ అధికారి కే.రాజు**

**బయ్యారం,మే23,ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ క్షేత్రాన్ని శనివారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు సందర్శించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట ఎరువు విత్తనాల నిల్వలు, పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. రైతులకు పంపిణీ చేయుటకు 500సంచుల జీలుగు విత్తనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విత్తనాల నాణ్యతను నిర్ధారించుటకు దైంచా విత్తనాల సర్వీస్ శాంపిల్స్ సేకరించి వాటిని స్వచ్ఛత, తేమశాతం, మొలక శాతం పరీక్షల నిమిత్తం వరంగల్ విత్తన పరీక్ష ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. భూమి సారాన్ని పెంపొందించుటకు, సేంద్రియ కార్బన్ శాతాన్ని మెరుగుపరుచుటకు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుటకు రైతులు జీలుగ పచ్చిరొట్ట ఎరువును వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటి సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలి

**మహబూబాబాద్ టౌన్,మే23,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన పంటను విక్రయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లానాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే వికాసిత్ భారత్ కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతన్న ఆరుగాలం కష్టపడి పండించిన దాన్యానికి ఇప్పటి వరకు కాంటాలు పూర్తికాకపోవడం దురదృష్టకరం అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు రైతులకు అనేక హామిలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి రైతులను మోసం చేసిందన్నారు. ఐకేపి కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాలను కోరారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫి**

**మహబూబాబాద్ టౌన్,మే23,ప్రభాతవార్త:**

కోర్టులో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి జూన్ 20న నిర్వహించబోయే రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫి తెలిపారు. శనివారం జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వలన కక్షిదారుల సమయం వృధా కాకుండా కోర్టు ఖర్చులు కూడా ఆదా అవుతాయని తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చున్నారు. ఇక్కడ వెలువడే తీర్పుకు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన గుర్తింపు ఉంటుందని దీనిపై మరల అప్పిలుకు వెళ్లే అవకాశం ఉండదని తద్వారా వివాదానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని పెర్కొన్నారు. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించి సత్వర న్యాయం అందించే లక్ష్యంగా ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు 50 వార్డు కౌన్సిలర్ లావణ్య వినతి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల పట్టణంలోని పలు వార్డుల్లో వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చింది.గుంపులు గుంపులుగా తిరుగుతూ,పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్న కుక్కలు నిత్యం రోడ్లపై వెళ్లే వృద్ధులు, మహిళలు,చిన్నారులపై దాడులకు తెగబడుతున్నాయి.ముఖ్యంగా తీవ్రమైన చర్మ వ్యాధులు సోకిన కుక్కలు తిరుగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ఈ వ్యాధి సోకిన కుక్కల వెంట్రుకలు రాలిపోయి,ఒళ్లంతా పొలుసులుగా మారి భీతావహంగా కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు,కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు,రాత్రి వేళల్లో బస్సులు,రైళ్లలో వచ్చి ఇళ్లకు చేరుకునే ప్రయాణికులు ఈ కుక్కల దాడికి గురవుతున్నారు.రాత్రి సమయాల్లో గుంపులుగా వెంటాడుతూ వింతగా అరుస్తున్న కుక్కల భయంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు.ఈ సమస్యపై 50వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ములస్తం లావణ్య మహేష్ స్పందించి,తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్‌కు అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు.గత మున్సిపల్ సమావేశంలోనే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదని ఆమె విమర్శించారు.2024లో టీఆర్ నగర్‌లో వీధి కుక్కలను పట్టుకుని నివాసముంచేందుకు సుమారు 30 లక్షల వ్యయంతో నిర్మించిన భవనం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.గత కౌన్సిల్‌లో కుక్కల సంతానోత్పత్తి నిరోధక శస్త్రచికిత్సల కోసం ఒక్కో కుక్కకు 1450 రూపాయల చొప్పున దాదాపు 70 లక్షలు కేటాయించినప్పటికీ,ఆ నిధులు ఏమయ్యాయని,కుక్కల సంఖ్య ఎందుకు తగ్గడం లేదని ఆమె అధికారులను నిలదీశారు.ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ,త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని ఆమె కోరారు.ఎలాంటి అవినీతికి తావులేకుండా,పారదర్శకంగా వీధి కుక్కలను పట్టుకుని,వాటికి చికిత్స అందించి పట్టణం వెలుపలికి తరలించాలని మున్సిపల్ యంత్రాంగాన్ని కౌన్సిలర్ లావణ్య మహేష్ డిమాండ్ చేశారు.పట్టణ ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని ఆమె స్పష్టం చేశారు.

## వివోఏ ల నిరవధిక సమ్మె

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని గ్రామ సంఘాల సహాయకులు (వీ.ఓ.ఏ)లు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 20 వేలు చెల్లించాలని, ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి, రూ. 20 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా, ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. 58 జీవోను సవరించాలని, 58 ఏళ్ల పదవీ విరమణ వయస్సు నిర్ణయించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గొడుగు బాలలక్ష్మి, కార్యదర్శి బంగారు అంజలి, ఉమారాణి, వీఓఏలు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైనా మామిడి తోట

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని చిక్కుడువాని పల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామ శివారులోని మామిడి తోట సమీపంలో గాలి దుమారానికి విద్యుత్ హై టెన్షన్ వైర్లు ఒక్కదాని పై ఒకటి తాకడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మంటలు మామిడి తోటలకు వ్యాప్తి చెందడంతో, కోతకు వచ్చిన మామిడికాయలు, మామిడి చెట్లు పూర్తిగా ఖాళీ బూడిద అయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ చింత మదక కళ్యాణ్, ఉపసర్పంచ్ చిక్కుడు సత్యం, గ్రామస్తులు వెంటనే మామిడి తోట వద్దకు చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు ఎక్కువ వ్యాపించడం వల్ల చాలావరకు చెట్లు, మామిడికాయలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామ పోలీస్ అధికారి రాధారపు సురేష్, జిపిఒ రాజు, యూత్ సభ్యులు ట్యాంకర్ సాయముతో మంటలు ఆర్పి అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదం వల్ల చాలా నష్టం వాటిల్లిందని సర్పంచ్ పేర్కొన్నారు.

## పదిలో టాపర్లకు వెంకట్ ఫౌండేషన్ సాయం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త




పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రహీంఖాన్ పేట ఆదర్శ పాఠశాల విద్యార్థులను వెంకట్ ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కరీంనగర్ లో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో 570 పైగా మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల నగదు బహుమతితో పాటు బంగారు పతకం మరియు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.గంగాధర్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ స్వప్న, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లితండ్రులు వెంకట్ ఫౌండేషన్ కరీంనగర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిరిసిల్లలో చోరీలు

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త

తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఎనిమిది మంది సభ్యుల దొంగల ముఠాను సిరిసిల్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 17.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 14.5 తులాల వెండి ఆభరణాలు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు సెల్ ఫోన్లు, రూ. 1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మీడియా సమావేశంలో వెల్లడించారు.

**జల్సాల కోసమే ముఠాగా ఏర్పడి..**

డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల బి.వై నగర్‌కు చెందిన అడెపు రవి (25) అనే పాత నేరస్థుడు జల్సాలకు అలవాటు పడ్డాడు. దొంగతనాలు చేయడమే వృత్తిగా మార్చుకున్న అతడు, పగటిపూట పట్టణంలో రెక్కీ నిర్వహించేవాడు. ఇందుకోసం తన స్నేహితులైన సామల్ల బాలకిషన్ (26), బోదాసు గోపి (19), వేముల సాయి చరణ్ రెడ్డి (19), గాజులవేణి కుమార్ (23), మూల అభిలాష్ (19)లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డాడు. వీరంతా రాత్రి సమయాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లపై పడి చోరీలకు పాల్పడేవారు. ఈ ముఠా లీడర్ అడెపు రవి గతంలోనే 18 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా, జైలు నుంచి బయటకు వచ్చాక మళ్లీ ముఠాను ఫామ్ చేసి నేరాలకు తెగబడ్డాడు.

గత నెల ఏప్రిల్ 26 నుండి మే 21వ తేదీల మధ్య కాలంలో సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు ఇళ్లలో ఈ ముఠా తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడింది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.




శనివారం ఉదయం ఈ ముఠా సభ్యులు మరో పెద్ద దొంగతనం చేసేందుకు ప్లాన్ వేసి ఆటోలో సిరిసిల్ల వైపు వస్తున్నారు. దీనిపై ముందస్తుగా నమ్మదగిన సమాచారం అందుకున్న పోలీసులు సిరిసిల్లలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పోలీస్ స్టేషన్లో విచారించగా నిందితులు తాము చేసిన దొంగతనాలను ఒప్పుకున్నారు. చోరీ చేసిన సొత్తును ముస్తాబాద్‌కు చెందిన కస్తూరి సాయితేజ, వేములవాడకు చెందిన శీలం సంతోష్ రెడ్డి (రిసీవర్లు) లకు అమ్మి, వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు అంగీకరించారు. దీంతో దొంగిలించిన సొత్తును రికవరీ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

**పోలీస్ సిబ్బందికి అభినందనలు**

చాకచక్యంగా వ్యవహరించి అంతర్జిల్లా దొంగల ముఠాను పట్టుకున్న పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ శ్రీకాంత్‌లతో పాటు సిబ్బంది పున్నం శ్రీనివాస్, శ్రీకాంత్, మారుతి, రవి, నాంపెల్లి శ్రీనివాస్, నాగరాజులను డీఎస్పీ నాగేంద్రచారి ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.

## పాలిటెక్నిక్ టి జి ఆర్ జె సి పరీక్షలలో జ్ఞాన దీప్ విద్యార్థుల ప్రభంజనం.....

ఎల్లారెడ్డిపేట మే 23, ప్రభాత వార్త

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామములోని జ్ఞాన దీప్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ రోజు శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించారని పాఠశాల కరెస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మి నారాయణ తెలిపారు. చల్ల శ్రీవర్ధన్ రెడ్డి టి జి ఆర్ జె సి పరీక్షలో స్టేట్ 246 ర్యాంక్ సాధించగా పాలిటెక్నిక్ పరీక్షలో 6467 ర్యాంక్, ముత్యాల శ్రీకరి 2697, శ్రీరాముల అశ్విత్ 5461ర్యాంక్ సాధించారు. ఒలింపియాడ్, ఐ ఐ టి తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు ఈ సందర్భంగా కరెస్పాండెంట్ లక్ష్మి నారాయణ విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని, తల్లిదండ్రులను అభినందించారు

## కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులపై టెలీ కాన్ఫరెన్స్‌పాల్గొన్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల బ్యూరో , మే 23, ప్రభాతవార్త



కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర రవాణా, ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, పూర్తయిన భూ సేకరణకు సంబంధించిన అంశాలు, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను ఆయన జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. టెలీ కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రాజేందర్ రెడ్డి, కె.ఎస్.బి. కుమార్, రైల్వే అధికారి మూర్తి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు న్యాయం కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

### కొత్త ఆసరా పెన్షన్లను దరఖాస్తు చేసుకోవాలి.

### చెట్టిపల్లి వెంకటేశ్వర్లు.

**మంగపేట మే23, ప్రభాతవార్త.** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అండగా, ఆసరాగా ఉండాలని పేదలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపల్లి వెంకటేశ్వర్లు అన్నారు అయన శనివారం ఒక ప్రకటన లో పునరుద్ఘ టించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్తగా రెండు లక్షల ఆసరా పెన్షన్లను ప్రారంభించనున్నారు. జూన్ 2వ తేదీన తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క మంత్రివర్గం కలిసి ప్రారంభించనున్నారు. మంగపేట ప్రజలందరూ గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారు తమకు సంబంధించిన గ్రామ పంచాయతీలో ఆసరా పెన్షన్ల గురించి పంచాయతీ కార్యదర్శి దగ్గర దరఖాస్తు చేసుకోవాలని చెట్టిపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆసరా పెన్షన్ లో వృద్ధాప్య పింఛను, వితంతు మహిళా, వికలాంగులు (దివ్యంగులు) ఒంటరి మహిళలు, దీర్ఘాలిక వ్యాధులు గల లబ్ధిదారులు అందరు ఈ అవకాశాన్ని వినియోగించు కోగలరని చెట్టిపల్లి వెంకటేశ్వర్లు కోరారు.

## తెలంగాణ మోడల్ స్కూల్ చల్వాయిలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

### ఎంపీడీవో వరుణ్ కుమార్ వెల్లడి




**గోవిందరావుపేట, ప్రభాతవార్త.** మండలంలోని చల్వాయి తెలంగాణ మోడల్ స్కూల్లో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ గ్రూపుల్లో ప్రవేశాలు ప్రారంభ మయ్యాయని గోవిందరావుపేట ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్ తెలిపారు. లక్నవరం క్రాస్ రోడ్ సమీపంలో హైవే పక్కన ఉన్న ఈ మోడల్ స్కూల్లో ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్మీడియట్ విద్యతో పాటు నీట్, డబల్ ఐటి, వంటి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. బాలికలకు హాస్టల్ వసతి కల్పిస్తున్నామని, డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేని మధ్యతరగతి, నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. మీ చుట్టుపక్కల ఉన్న అర్హులైన విద్యార్థులకు ఈ సమాచారం చేరవేయాలని సూచించారు. ఇంటర్మీడియట్‌తో పాటు 6 నుండి 10వ తరగతి వరకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ తరగతుల విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కలదు. ఆసక్తి గల వారు నేరుగా పాఠశాలను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కుమార్ ను 8096350115 నంబర్‌లో సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు.